నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఆదివారం 03 ఆగస్టు 2025
వైఎస్ఆర్ కడప
పేజీలు - 08





# అన్నదాత సుఖీభవ

**జిల్లాలో 1,94,047 మంది రైతులకు లబ్ధి**

**సుఖీభవ, పీఎం కిసాన్ కలిపి మొత్తం రూ.132.93 కోట్లు రైతుల ఖాతాలకు జమ**

**ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరయపాలెంలో లాంచనంగా ప్రారంభించిన సీఎం బాబు**

**ప్రొద్దుటూరులో చెక్కు విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే వరద**



కడప బ్యూరో - మేజర్‌న్యూస్ : ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను ఒకటొకటే నెరవేరుస్తూ ముందుకు సాగుతోంది రాష్ట్ర సర్కార్. అన్నదాతలకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20వేలను రైతు ఖాతాలకు జమ చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరయపాలెంలో లాంచనంగా ప్రారంభించారు. వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ..మిగతా 2వ పేజీలో

## వ్యవసాయంలో ఆర్థిక ఇబ్బందులు...
# రాకూడదు!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం 2025 - 26 మొదటి విడత నిధులు విడుదల**

**జిల్లాలో 1,94,047 మంది రైతులకు రూ.132.93 కోట్ల లబ్ధి**



2లో




# పులివెందులలో పొలిటికల్ రేస్!

- పులివెందుల జడ్పీటీసీ స్థానం కోసం అధినేతలే రంగంలోకి..
- సొంత స్థానంలో పట్టునిలుపుకునేందుకు వైయస్ జగన్ సవారీ
- ఎంపీ అవినాష్, ఎస్‌వీ సతీష్‌రెడ్డిలకు పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల బాధ్యత
- కత్తికి రెండు వైపులా అన్నట్లు రంగంలోకి టీడీపీ
- గెలిచి జగన్‌పై మానసికంగా పైచేయి సాధించాలని భావిస్తున్న సీఎం చంద్రబాబు
- టీడీపీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలిచ్చిన అధినేత
- బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డికి సమన్వయ బాధ్యతలు

## ఎన్నిక చిన్నదే.. పోటీ పెద్దది

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

జడ్పీటీసీ ఎన్నిక చిన్నదే! అయినా పొలిటికల్ రేస్ పెద్దగా ఉంది. జిల్లాలో వైసీపీ - టీడీపీ మధ్య ఆధిపత్య పోరుకు ఈ ఎన్నికలు వేదికగా నిలవబోతున్నాయి. నువ్వా?..నేనా? అన్నట్లు పోటీలోకి దిగుతున్నాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఏకంగా రెండు పార్టీల అధినేతలే రంగంలోకి దిగి వ్యూహాలకు పదునుపెడుతున్నారు. సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటించి వెళ్తూ పులివెందుల స్థానంలో గెలిచి తీరాలని పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎన్నిక ప్రాధాన్యతను గుర్తు చేసి వెళ్లారు. మరోవైపు సొంత నియోజక వర్గం పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని నిలుపుకునేందుకు వైసీపీ అధినేత వైయస్.జగన్ తెరవెనుక వ్యూహాలకు పదును పెడుతున్నాడు. ఇప్పటికే తన సోదరుడు కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్ రెడ్డికి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక రసవత్తరంగా మారింది. టీడీపీ - వైసీపీ శ్రేణులు ఢీ అంటే ఢీ అంటున్నాయి. పులివెందుల మాదే!.. అంటూ రెండు పార్టీల నేతలు మీసాలు మెలేస్తున్నారు. 2లో

## ఓపెన్ డిగ్రీ, పీజి ఎగ్జామ్‌లో
# మాస్ కాపీయింగ్
వార్త 8వ పేజీలో

## జడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ
# టిడిపిలోకి వలసలు
వార్త 4వ పేజీలో

## పకడ్బందీగా జడ్పీటీసీ...
# ఉప ఎన్నికలు

- పులివెందుల జడ్పిటిసి స్థానానికి 12 నామినేషన్లు, ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానానికి 21 నామినేషన్లు
- పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్లు 10601 ఓటర్లు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ స్టేషన్లు 24606 ఓటర్లు



# అన్నదాత సుఖీభవ

(మొదటి పేజీ తరువాయి)



జిల్లా నేతలు, అధికారులు వీక్షించారు. ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజు పల్లె లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రొద్దుటూరు శాసనసభ్యులు ఎన్.వరదరాజుల రెడ్డి వీరితో పాటు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ పథకం కింద కడప జిల్లాలో 1,94,047 మంది రైతులు లబ్ధిపొందారు. అన్నదాత సుఖీభవ కింద ఒక్కొక్క రైతుకు అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి రూ.7వేలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.97.0235 కోట్లు, పిఎం కిసాన్ కింద రూ.35.91 కోట్లు కలిపి రూ.132.93 కోట్లు రైతల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది. దీంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. జిల్లాలోని ఏడు నియోజక వర్గాలకు సంబంధించి 1,94,047 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద మేలు కలగనుంది. ఇందులో బద్వేల్ నియోజక వర్గంలో 34,148 మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం కలిపి రూ.23.25 కోట్లు, జమ్మలమడుగు నియోజక వర్గంలోని 35,148 మంది రైతులకు రూ.24.11 కోట్లు, కడప నియోజక వర్గానికి సం బంధించి 1576 మంది రైతులకు 0.98 కోట్లు, కమలాపురం నియోజక వర్గానికి సంబంధించి 30,700 మంది రైతులకు రూ.21.04 కోట్లు, మైదుకూరు నియోజక వర్గానికి సంబంధించి 34,081 మంది రైతులకు రూ.23.53 కోట్లు, ప్రొద్దుటూరు నియోక వర్గంలోని 10,326 మంది రైతులకు రూ.7.10 కోట్లు, పులివెందుల నియోజక వర్గంలోని 41,980 మంది రైతులకు రూ.28.78 కోట్లు, రాజంపేట నియోజక వర్గంలోని సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన 6052 మంది రైతులకు రూ.4.14 కోట్లు జిల్లాకు మంజూరైంది. ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి.

# పులివెందుల రేస్!

**కడప బ్యూరో - మేజర్‌న్యూస్:** జిల్లాలో పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి మృతితో ఈ స్థానం ఖాళీ అయింది. అదేవిధంగా ఒంటిమిట్టలో గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా కొనసాగిన ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈనెల 12న పోలింగ్, 14న కౌంటింగ్ ఫలితాల వెల్లడి కానున్నాయి. అయితే జడ్పీటీసీ ఎన్నిక అనేది చిన్న విషయమే. ఒక మండలానికి పరిమిత మయ్యే ఎన్నిక. పొలిటికల్ పార్టీలు ఒక జడ్పీటీసీ ఉప ఎన్నికను అంత సీరియస్‌గా తీసుకోవు. కానీ జరుగుతున్నది పులివెందులలో. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్.జగన్ ప్రతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గ కేంద్రం. అందుకే ఈ జడ్పీటీసీ ఎన్నిక టీడీపీ - వైసీపీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ స్థానంలో మృతి చెందిన మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులనే వైసీపీ రంగంలోకి దింపింది. ఆయన సతీమణి తుమ్మల ఉమాదేవీ, కుమారుడు తుమ్మల హేమంత్‌రెడ్డిలు నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ శ్రేణులతో ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వైసీపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అయితే నోటిఫికేషన్ వచ్చిన రెండు రోజులు ఎటువంటి హడావుడి చేయని టీడీపీ నేతలు నామినేషన్ల చివరి రోజు ఒక్కసారిగా తెరపైకి వచ్చారు. పార్టీ పులివెందుల నియోజక వర్గ ఇంఛార్జి మారెడ్డి రవీంధ్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) కుటుంబ సభ్యులు పోటీ చేస్తున్నారని తెలియడంతో నియోజక వర్గంలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్టానం ఆదేశించడంతో పులివెందుల జడ్పీటీసీ స్థానం నుంచి బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతారెడ్డి, ఆయన సోదరుడు మారెడ్డి జయభారత్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. బీటెక్ వర్గంతో విభేదాలున్న ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి సైతం లతారెడ్డి నామినేషన్‌కు హాజరై తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని తీరతామని ప్రకటించారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక, పోటీ వివరాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఎట్టిపరిస్థితుల్లో జడ్పీటీసీ స్థానంలో గెలవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తద్వారా వచ్చే ఎన్నికల్లో పులివెందుల అసెంబ్లీ స్థానం కూడా మాదే అని గట్టిగా చెప్పినట్లు ఉంటుందని సీఎం బాబు భావిస్తున్నారు. పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని సాధించడం ద్వారా వైయస్.జగన్‌పై మానసికంగా పైచేయి సాధించినట్లు అవుతుందని బాబు ఆలోచనగా ఉంది. అందుకే ఈ అవకాశాన్ని సద్దినియోగం చేసుకుని ఎట్టి పరిస్థితుల్లో పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవాల్సిందేనని చంద్రబాబు పార్టీ నేతలకు సూటిగా చెప్పారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ కూడా పులివెందులపై పట్టు నిలుపుకునేందుకు పావులు కదుపుతున్నారు. జడ్పీ టీసీ స్థానాన్ని నిలుపుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇప్పటికే కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.సతీష్‌రెడ్డిని రంగంలోకి దిం పారు. పార్టీ శ్రేణులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. నేడో..రేపో వైయ స్.జగన్ కడప జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దీం తో పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు రెండు పార్టీలకు ఇజ్జత్‌కా సవాల్! అన్నట్లు మారిపోయింది. ఉన్న స్థానాన్ని నిలబెట్టుకుంటూ పరువు కాపాడుకోడంతో పాటు టీడీపీ పాగా వేయకుండా అడ్డుకునేందుకు వైసీపీ అధినేత ప్రయత్నిస్తుండగా.. పులివెందుల జడ్పీటీసీ స్థానంలో గెలిచి పార్టీ శ్రేణులను వచ్చే ఎన్నికలు సిద్ధం చేయడంతో పాటు వైయస్.జగన్‌పై మానసికంగా పైచేయి సాధించవచ్చని టీడీపీ అధినేత భావిస్తున్నారు. ఇలా. వైయస్.జగన్ - సీఎం చంద్రబాబు మధ్య పులివెం దుల జడ్పీటీసీ జగడం రసవత్తరంగా మారింది.

# పకడ్బందీగా జడ్పీటీసీ ఉప ఎన్నికలు

కడప ప్రతినిధి - మేజర్ న్యూస్

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డ్ రూమ్ హాల్ నందు పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల నిర్వహణ పై జెడ్పి సీఈవో ఓబులమ్మ తో కలిసి డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ... జెడ్పిటిసి ఉప ఎన్నికల నిర్వహణకు సంబంధించి.. రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో.. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో పాటు ఓటర్లు, సాధారణ ప్రజానీకం అందరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పులివెందల రెవిన్యూ డివిజన్, కడప రెవెన్యూ డివిజన్ అంతట అమలులో ఉంటుందని తెలిపారు. సెల్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్లను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జడ్పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులకు విధులను కేటాయించడం జరిగింది. జడ్పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పులివెందుల ఆర్వోగా నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఒంటిమిట్ట ఆర్వోగా డిప్యూటీ కలెక్టర్ రిమ్స్ రంగస్వామి లను నియమించారన్నారు. జులై 30 నుంచి ఆగస్టు 1వ తేదీ సాయింత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించామన్నారు. పులివెందుల స్థానానికి సంబంధించి 12 నామినేషన్లు, ఒంటిమిట్ట స్థానానికి సంబంధించి 21 నామినేషన్లు వచ్చాయన్నారు. శనివారం నామినేషన్ పత్రాల పరిశీలించడం జరిగిందన్నారు. ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరణకు గురైన వాటి పై అప్పీలేట్ అధికారికి ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. ఆగస్టు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామన్నారు. పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్లు 10601 ఓటర్లు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ స్టేషన్లు 24606 ఓటర్లు ఉన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కే. ప్రకాష్ బాబు బాబు, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సుధాకర్, పులివెందుల ఏఆర్ఓ కృష్ణమూర్తి, ఒంటిమిట్ట ఏఆర్ఓ సుజాతమ్మ, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో.. ఆర్థిక ఇబ్బందులు రాకూడదు!

(మొదటి పేజీ తరువాయి)







**ప్రొద్దుటూరు - మేజర్‌న్యూస్ :** దేశానికి వెన్నుముక అయిన అన్నదాతకు వ్యవసాయంలో ఎలాంటి ఆర్థిక ఒడిదుడుకులు రాకూడదన్నదే.. "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో భాగంగా.. శనివారం ప్రకాశం జిల్లా దర్శి మండలం ఈస్ట్ వీరాయపాలెం గ్రామం నుంచి "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం" 2025 - 26 సం.నికి మొదటి విడత లబ్ది మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అందుకు సంబంధించి జిల్లా కార్యక్రమాన్ని ప్రొద్దుటూరు మండల పరిధిలోని చెన్నంరాజుపల్లెలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డి.ఆ శ్రీధర్ చెరుకూరి తోపాటు..ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డి.ఆ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... దేశానికి వెన్నుముక అయిన అన్నదాత వ్యవసాయ సాగుబడిలో ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం పేరుతో రైతులకు ఆర్థిక చేయుతను ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఒంగోలు జిల్లా దర్శిలో ఏర్పాటు చేసిన సభ నుండి ప్రారంభించారన్నారు. కాగా ఈ పథకం కింద మొదటి విడతగా ఒక్కక్కరికి రూ.7000 ల చొప్పున వైఎస్ఆర్ కడప జిల్లాలో 1,94,047 మంది రైతులకు.. అన్నదాత సుఖీభవ కింద (ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున) మొత్తం రూ.97.0235 కోట్లు, పీఎం కిసాన్ కింద (ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున) మొత్తం రూ.35.91 కోట్లు కలిపి మొత్తం రూ.132.93 కోట్ల మేర లబ్ది చేకూర్చడం జరిగిందన్నారు. ఇటీవల రైతులు చాలా మంది అధిక మోతాదులో రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. అధికంగా మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించడం ద్వారా.. రైతు కుటుంబాల ఆరోగ్యం పడవ్వడమే కాకుండా.. ప్రకృతికి కూడా హాని కలిగించే విషయం అన్న నిజాన్ని గుర్తించి నడుచుకోవలన్నారు. మోనో క్రాప్ కల్చర్ ను మానుకుని.. బహుళ పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చడం కోసం ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు, రాయితీలు నదిస్తోందన్నారు. సంప్రదాయ పంటలకు ఆదాయం తక్కువే అని, అదే ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారిస్తే.. ఒక్క ఎకరాకు కనీసం లక్ష రూపాయల ఆదాయము గడించే అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను రైతులకు స్ఫూర్తిని ఇచ్చే రాజస్థాన్ లోని ఒక గ్రామాన్ని పరిశీలించేందుకు కూడా పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మనం పండించే దిగుబడి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితి ఎదుఎయితే.. రైతుల పరిస్థితి ఏంటి అని గుర్తు చేశారు. ఈ విషయాన్ని గుర్తుంచుకొని రైతులు అవగాహన పెంపొందించుకుని.. ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించి పంటల దిగుబడిలో ఆదాయాన్ని, కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులు కూడా ఈ విషయాల్లో రైతులను చైతన్యవంతులను చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కాగా.. కొన్ని కారణాల వల్ల నాన్ అపరేటివ్ బ్యాంకు అంకౌంట్లకు లబ్ది మొత్తం వెంటనే జమ కాకపోవచ్చున్నారు. కావున పథకం లబ్ది పొందడంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురయితే.. సంబందిత జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో గానీ, స్థానిక మండల వ్యవసాయ అధికారిని సంప్రదించవచ్చున్నారు.

**ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోంది..: ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి**

ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోంది. మన ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది, విధి విధానాలను కట్టుబడి ఉంది న్ని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక విజన్ తో ముందుకు సాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభువృద్ధిలో మనం కూడా భాగస్వామ్యం అవుదాం నన్నారు. ఇటీవలే... దేశానికే స్ఫూర్తినిచ్చేలా పి4 ఫౌండేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ.. సమాజమాలో పేదరికాన్ని నిర్మూలించే లక్ష్యంతో.. బంగారు కుటుంబాలను, మార్గదర్శులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందిన మండల రైతులకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్ర నాయక్, ప్రొద్దుటూరు అగ్రికల్చర్ ఎడి అనిత, ఏవో వరహరి, మాజీ జడ్పిటిసి సభ్యులు మహేశ్వర్ రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, శివచంద్రారెడ్డి, చెన్నంరాజుపల్లి సర్పంచ్ రాజువారి ఆదిలక్ష్మమ్మ, మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ రాజువారి వెంకటసుబ్బయ్య, లింగాపురం లింగాపురం సింగల్ విండో అధ్యక్షుడు సిద్ధారెడ్డి నాగ మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధుల విడుదల



**చాపాడు, మేజర్‌న్యూస్ :** చాపాడు మండలం అన్నవరం రైతు సేవా కేంద్రం నందు శనివారం అన్నదాత సుఖీభవ - కార్యక్రమమును టీడీపీ మండల అధ్యక్షుడు పల్లవోలు సుధాకర్ రెడ్డి రైతులు మరియు అధికారుల సమక్షంలో విక్షించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రతి రైతు ఖాతాకు మొదటి విడతగా రూ.7,000/- జమ చేసే కార్యక్రమంను తిలకించారు. ఈ సందర్భంగా చాపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని, రైతులకు అన్నికాలాలుగా మేలు చేసే పనులు మరిన్ని తీసుకొచ్చేలా ముందుకు వెళ్తామని, ప్రతి రైతుకు ఏటా ఇరవై వేల రూపాయలు పెట్టుబడి సాయం కింద అందిస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత అధికారులు, నాయకుల సమక్షంలో వ్యవసాయ శాఖ మాస పత్రిక ఐన పాడి పంటల మ్యాగజైన్ జూలై శీర్షికను ఆవిష్కరించి అలాగే రైతులకు అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంద్యాల లోకేశ్వర రెడ్డి, లింగిరెడ్డి నాగేశ్వర రెడ్డి, రాజారెడ్డి, పుత్త సుదర్శన్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి శ్రీనివాస్, అగ్రికల్చర్ అసిస్టెంట్ చిట్టిబాబు, రైతులు పాల్గొన్నారు.

## సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన కిన్నెర సింగరయ్యను అభినందించిన ఎస్ఐ తిమోతి



**కలసపాడు, మేజర్‌న్యూస్:** శుక్రవారం విడుదల చేసిన పోలీస్ ఫలితాలలో కలసపాడు మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన కిన్నెర సామెల్ మరియు చిన్నక్కల కుమారుడు కిన్నెర సింగరయ్య సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక అయిన సందర్భంగా కలసపాడు మండలం సబ్ ఇన్స్పెక్టర్ తిమోతి, హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమోతి సివిల్ కానిస్టేబుల్ కి ఎంపికైయిన కిన్నెర సింగరయ్యను ఇంకా మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కలసపాడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సి గోపులాపురంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు





**కమలాపురం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని సి గోపాలపురం గ్రామంలో ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శ్రావణ మాస రెండో శనివారం పురస్కరించు కుని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం, విశేషాలంకరణ, సింధూరంతో అర్చన, ఆకు పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన కుమ్మత శ్రీనివాసులు రెడ్డి, సుమిత్ర దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివరాం రెడ్డి రమణారెడ్డి మల్లికార్జునరెడ్డి రాంబాబు నవనీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కమలాపురం కోగటం తదితర గ్రామాలలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ





**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ స్వామిత్వ కింద ఎంపిక అయినందున గ్రామపంచాయతీ కి సంబంధించిన గ్రామసభ సర్పంచ్ యనమల సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికి సంబంధించిన కొలతలు అధునాతన సాంకేతికతతో తీసుకుని ఇంటికి యాజమాన్య హక్కు ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు. దీనికి సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అన్ని రంగాల అభివృద్ధి వైయస్ జగన్మోహన్ రెడ్డి చలువే

**ఆదరించండి అన్ని రకాలుగా అభివృద్ధికి తోడ్పడతా**
**జడ్పీటీసి అభ్యర్థి హేమంత్ పిలుపు**



పులివెందుల, మేజర్‌న్యూస్: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని వారి ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధి లక్ష్యంగా జడ్పీటీసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని హేమంత్ రెడ్డి మండల ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన పత్రికాముఖంగా మాట్లాడుతూ గతంలో తండ్రి మహేశ్వర్ రెడ్డికి ఇస్తున్నటువంటి ఆదర అభిమానులతో నన్ను జడ్పీటీసి అభ్యర్థిగా పులివెందుల మండల పంచాయతీలో గల ఓటర్లు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ, రానున్న కాలంలో జడ్పీటీసి పంచాయతీలో ఉన్న ప్రజలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటూ ప్రజా శ్రేయస్సు కోసం అనునిత్యం కృషి చేస్తానని, ఈ జెడ్పీటీసి ఎన్నికలలో మీ అందరి ఆశీస్సులతో గెలిచి జగన్మోహన్ రెడ్డికి ఎంపీ అవినాష్ రెడ్డికి గిఫ్ట్‌గా అందజేద్దామని అభ్యర్థించారు.

## రైతులకు ప్రభుత్వ సాయం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం



**చాపాడు మేజర్‌న్యూస్ :** చాపాడు మండలం పల్లవోలు రైతు సేవాకేంద్రంలో పిఎం -కిసాన్ అన్నదాత సుఖీభవ పంట సాయం బ్రోచర్లను ఎమ్మార్వో రమా కిమారి, వ్యవసాయ అధికారి దేవి పద్మలతలు స్థానిక రైతులతో కలిసి అవిష్కరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరియు రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు నారాచంద్రబాబు నాయుడు పిఎం-కిసాన్ అన్నదాత సుఖీభవ మీద లైవ్ కార్యక్రమం ప్రదర్శించడం జరిగింది. ఏఈవో స్వప్న, పల్లవోలు విఏఏ సుష్మ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అలాగే భారత ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరియు రైతు సంక్షేమ శాఖ వ్యవసాయం మరియు రైతుల సంక్షేమ పంట బీమా నమోదు తేదీని పొడిగించడం జరిగిందన్నారు.పంటల లోన్ తీసుకొని రైతులకు వరి మినహా మిగతా పంటలకు ఆగస్టు 14 వరకు తేదీ వరకు పొడిగించడం జరిగిందని. వరికి అయితే ఆగస్టు 15 చివరి తేదీ అని. రైతులు ఎవరైతే లోన్ ను జూలై 31 - 2025 తేదీ వరకు తీసుకోవడం కానీ రెన్యువల్ కానీ చేసుకున్న వారికి ఆగస్టు 30 ,2025 వరకు చివరి తేదీ ఇవ్వడం జరిగిందన్నారు. రైతులందరూ ఈ మార్పును గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకం కింద మన కడప జిల్లాలో వర్తించే పంటల వివరాలు. పసుపు ఎకరాకి 180 రూపాయలు, జొన్నలు ఎకరాకి 38 రూపాయలు, మినుము ఎకరాకి 38 రూపాయలు, ఉల్లి ఎకరాకి 90 రూపాయలు, వరి ఎకరాకి 84 రూపాయలు, కందికి ఎకరాకి 36 రూపాయలు రైతు ఇన్సూరెన్స్ చేసుకోవాల్సిన మొత్తంగా సూచించారు

## ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యం మత్తు జోలికి వెళ్లొద్దు

**ట్రాఫిక్ సీఐ హాజీవల్లీ**



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యం కావున మత్తు జోలికి వెళ్లొద్దు అని ఆటో డ్రైవర్ లకు పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి సూచించారు. స్థానిక సిఎస్ఐ చర్చి మైదానంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణం లోని ఆటో డ్రైవర్ లకు నిర్వహించిన మాదక ద్రవ్యాల నివారణ పై అవగాహనా కార్యక్రమం లో ట్రాఫిక్ సీఐ హాజీవల్లి మాట్లాడుతూ ఒక్క ఆటో డ్రైవర్ చేతిలో కొంతమంది ప్రయాణికుల ప్రాణాలు ఉన్నాయని, అలాగే ఇంటి వద్ద నీకోసం నీ కుటుంబం ఎదురు చూస్తూ ఉంటుందనే విషయం ప్రతి డ్రైవర్ కి అనుక్షణం మదిలో మెదులుతూ ఉండాలని అప్పుడే మత్తు జోలికి వెళ్లకుండా ఉండేందుకు అవకాశం ఉంది అని, అలాగే కొన్ని సమయాల్లో మానసిక, శారీరక ఒత్తిడి అనిపించినప్పుడు మత్తు పానీయాల మార్గం ఎంచుకోవద్దు అని, ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కాలక్షేపంగా తగినంత విశ్రాంతి తీసుకోవాలి అని తద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు కుటుంబంలో ఒక ఆహ్లాదకరమైన వాతావరణం ఇచ్చిన వారు అవడంతో పాటు ప్రయాణికులను సురక్షితం గా వారి గమ్యానికి చేర్పినవారవుతారన్నారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు మాదక ద్రవ్యాలు మత్తు పానీయాలు నిలయాలు అలాగే అనారోగ్యం బారిన పడేందుకు మార్గాలు అని జీవితాంతం ఎంతో కష్టపడి సంపాదించిన సంపాదన కొద్ది కాలం లోనే కోల్పోవడం జరుగుతుంది అలాగే సమాజం లో గౌరవాన్ని కోల్పోతారన్నారు.అనంతరం ప్రజలకు తెలియజేసేందుకు మత్తు వలన జరిగే అనర్థాలతో కూడిన పోస్టర్ లు ఆటో లకు అతికించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్ లు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పైప్ లైన్‌కు మరమ్మతులు



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ముస్లిం కోట వీధిలో రోడ్డు మధ్యలో ఉన్న పైప్ లైన్ లీకేజీని మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓబులేసు వార్డు మెంబర్ దర్వేష్‌లు పర్యవేక్షించి మరమ్మతులు చేయించారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్ :** రోడ్డు భద్రత పై ప్రజలకు ప్రతి శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసు స్టేషన్ పరిధులలో పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు, బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# భక్తుల పారవశ్యం శ్రీ చెన్నకేశవుని ఉత్సవం

## వెల్లాలలో మారుమోగిన భజన సంకీర్తనలు



రాజుపాళెం, మేజర్‌న్యూస్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెల్లాల శ్రీ చెన్నకేశవ సంజీవరాయ స్వామికిరెండవ శనివారం శ్రావణమాస పూజలు ఘనంగా జరిగాయి ఉదయం నుండే వివిధ ప్రాంతాల నుండిపుణ్యక్షేత్రానికి చేరుకున్న భక్తులు స్వామివారి సేవలోతరించారు ఉత్సవ కమిటీ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి శ్రీ సంజీవరాయ స్వామి పల్లకిలో గ్రామోత్సవం మేళ తాళాలుభజన సంకీర్తనల మధ్య సాగింది స్వామివారి పల్లకి ఏర్పాటుచేసిన వాహనాన్ని భక్తులు లాగుతూ ఆలయ మాడవీధుల్లో ఉత్సవం నిర్వహించారు శ్రీ చెన్నకేశవ సంజీవరాయ గోవిందా అంటూ భక్తులుపారవశ్యంతో పులకించి పోయారు.శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం వెనకవైపు భక్తులకు అన్నదానం నిర్వహించారు ధ్యాన మందిరంలో పర్లపాడు భజన బృంద సభ్యులు ఆల పించిన భక్తి గీతాలు హొరెత్తించాయిఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యు లు గంగిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి ఈవో కె.వి.రమణ మండల టిడిపి నాయకులు దుద్దెలసుబ్బిరెడ్డి ఆలయ మాజీ చైర్మన్ సుంకు గారి రామసు బ్బారెడ్డి ఆలయ సీనియర్ అసిస్టెంట్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

## – అప్పసా స్టేట్ జాయింట్ సెక్రటరీ మూలే విజయలక్ష్మి



దువ్వూరు, మేజర్‌న్యూస్ : పాఠశాలల్లోకి తల్లిదండ్రులు తప్ప మరి ఎవరు అనుమతి లేకుం డా ప్రవేశించరాదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు ఒకటో తేదీన జారీ చేసిన ఉత్తర్వులు పాఠ శాలలకు ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలలకు ఎం తో ఉపయోగకరంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ స్టేట్ వుమన్ వింగ్ జాయింట్ సెక్రెటరీ మూలే.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రైవేట్ బడ్జెట్ పాఠశా లల్లోకి విద్యార్థి సంఘాల వారు, కుల సంఘాల వారు విద్యార్థులకు సంబంధం లేని వారు దౌర్జన్యంగా ప్రవేశిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నందువల్ల అప్ప అభ్యర్థన మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం రాష్ట్రంలో ని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ఎంతో ఉపయుక్తంగా ఉండబోతుందని ఆమె తెలిపారు.ఎవరైనా ఏదైనా సమస్యను గురించి తెలపాలనుకున్నప్పుడు విద్యా ర్థులను కలవకుండా నేరుగా హెడ్మాస్టర్ కు మాత్రమే వినతిపత్రం సమర్పించ వలసి ఉంటుందని, అలాగే ఎలాంటి రాజకీయ పార్టీకి సంబంధించిన జెండాలో పోస్టర్లు కూడా పాఠశాల ఆవరణలో అంటించరాదని ఈ ఉత్తర్వుల్లో ఉందని ఆమె తెలిపారు.సాహసోపేతమైన ఈ నిర్ణయాన్ని తీసుకుని ప్రైవేట్ పాఠశాలల కు ఎంతో సహాయం చేసిన పాఠశాల విద్యాశాఖ మంత్రి లోకేష్ కు విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

# తల్లిపాలు బిడ్డకు అమృతం

## ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య



దువ్వూరు, మేజర్‌న్యూస్ : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసిడి ఎస్ సూపర్వైజర్ సౌజన్య పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల దినోత్సవం సంద ర్భంగా శనివారం దువ్వూరు మండలంలోని గుడిపాడు సెక్టార్‌లో బయనపల్లి అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గుడిపాడు సెక్టార్ సూపర్వైజర్ సౌజన్య మాట్లాడుతు ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి ఏడవ తేదీ వరకు అంగన్వాడి కేంద్రాలలో జరుపుకుంటాము. పుట్టిన గంటలోపు ముర్రు పాలు పట్టించాలి, పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతము, బిడ్డకు ముర్రు పాలు మొదటి టీకా,పుట్టిన బిడ్డకు సరైన పోషణ అందుతుందని రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అలర్జీ ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి మరియు బిడ్డకు అవినాభావ సంబంధం పెరుగుతుంది. కుటుంబ సభ్యుల సహకారంతో తల్లి బిడ్డకు చనుబాలు ఇచ్చేందుకు ప్రోత్సాహం మరియు బిడ్డ ఆరోగ్యకరమైన జీవితానికి సహకారం చేస్తుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు పిల్లలకి టీకాల కార్యక్రమం జరిగినది .ఈ కార్యక్రమంలో ప్యారి సిస్టర్ మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లిపాలు తాపడం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది మరియు బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ మరియు గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలియజేశారు. ఈ విధంగా సి బయనపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భవతులకు తల్లిపాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, తల్లులు, ఎమ్ ఎల్ హెచ్ పి. సౌభాగ్య లక్ష్మి , సచివాలయం ఏఎన్ఎం జ్యోతి అంగన్వాడి టీచర్ సి.రాధ, ఆయా మీన తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ మిగతా హామీలు అమలు చేయాలి

## అన్నదాత సుఖీభవపై ఆంక్షలు వద్దు

## ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి



వేంపల్లె, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వం చెప్పినట్లుగా సూపర్ సిక్స్ పథకా ల్లోని ఇతర హామీలు అమలు చేయాలని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువత కు సంబంధించి రూ. 3 వేలు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి కింద రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకు పెన్షన్ తదితర వాటిని వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా అన్నదాత సుఖీభవ పథ కంపై ఎలాంటి ఆంక్షలు విధించకుండా అర్హత కలిగిన ప్రతి రైతుకు వర్తింప చేయాలన్నారు. కౌలు, డికేటీ, చుక్కల భూములకు కూడా ఆ పథకాన్ని అమలు చేయాలని కోరారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతి ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం, గతేడాది ఆర్థిక సాయాన్ని కలిపి ఇవ్వాలని తులసిరెడ్డి అన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశాల కొరకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ 2025–26 విద్యాసం వత్సరంనకు అడ్మిషన్‌కు కడప, అన్నమయ్య జిల్లాలో గల 24 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలలో 25 26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల కొరకు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ను సంప్రదించి నేరుగా అడ్మిషన్ పొందవచ్చునని జిల్లా సమన్వయ అధికారి ఉదయశ్రీ ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ వివరములకు మీకు కడప, అన్నమయ్య జిల్లాలలో 24 గురుకులాల్లో తరగతులు వారిగా ఐదవ తరగతిలో 350, ఆరవ తరగతిలో 201, ఎనిమిదో తరగతిలో 114, 12వ తరగతిలో 59 ఖాళీలు కలవని తెలియజేశారు.

# జడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ టిడిపిలోకి వలసలు

## ప్రజా ప్రతినిధులే లక్ష్యంగా బీటెక్ రవి అడుగులు

## వైస్ ఎంపీపీ విశ్వనాథరెడ్డి టిడిపిలో చేరిక



పులివెందుల, మేజర్‌న్యూస్: పులివెందుల మండల జడ్పీటిసి ఉప ఎన్నికలవేళ పులివెందుల మండల పరిధిలో ఇప్పటికే రాజకీయ వేడి మొదలవగా ప్రజా ప్రతినిధుల వలసలతో మరింత వేడెక్కే కార్యక్రమాలకు బీటెక్ రవి నాంది పలకగా పలువురు ప్రజాప్రతినిధులే లక్ష్యంగా బీటెక్ రవి అడుగులు వేస్తూ వైసీపీకి గట్టి షాకులు అందిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే పులివెందుల మండల పరిధిలో జడ్పీటిసి ఎన్నికకు ఎన్నికల సంఘం ప్రకటన వెలువడిన రోజు నుండి బీటెక్ రవి తన రాజకీయ చతురతతో మండల పరిధిలోని వివిధ నాయకులను టిడిపిలోకి ఆహ్వానించే విషయంలో విజయం సాధిస్తూ వారిని నేరుగా చంద్రబాబు ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమాలతో ముందుకెళ్లగా వాటిలో భాగంగానే కొత్తపల్లి పుష్ప నాథ్ రెడ్డి మరియు ఇతర నాయకులు పార్టీ తీర్థం పుచ్చుకోగా శనివారం పులివెందుల మండల పరిధిలోని తుమ్మలపల్లె ఎంపీటీసీ మరియు మండల వైస్ ఎంపీపీ అయినటువంటి విశ్వనాథరెడ్డి బీటెక్ రవి ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చు కున్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ విధానాలను నిరసిస్తూ చంద్రబాబు సంక్షేమానికి మరియు పాల నాదక్షితకు ఆకర్షితులై టిడిపిలోకి వలసలు కొనసాగుతున్నాయని చేరిన ప్రతి ఒక్క నాయకునికి అన్ని రకాలుగా అండదండలు అందించి వారు ఆశించిన టువంటి అభివృద్ధిని మండల పరిధిలో చూపిస్తామని భరోసా కల్పించారు.

# బళ్ళారి రాఘవ మానవతా కళాప్రపూర్ణుడు

## తెలుగు నాటక రంగంలో విశిష్ట సేవలు – ఘనంగా బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలు

కడప ప్రతినిధి – మేజర్‌న్యూస్: తెలుగు నాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన మానవతా కళాప్రపూర్ణుడు బళ్ళారి రాఘవ అని, ప్రతి ఒక్కరికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని జి ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు స్టెప్, జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ 145 జయంతి ఉత్స వాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జి ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ కలెక్టర్ నీలమయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన గావించారు.బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిఎన్ఎస్ఎస్ స్పెషల్ కలె క్టర్ నీలమయ్య మాట్లాడుతూ... నాటక రంగానికి ఎనలేని కృషి చేసిన బళ్లారి రాఘవ స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమన్నారు. బళ్లారి రాఘవ అసలు పేరు తాడిపత్రి రాఘవాచార్యులని ఆయన తాడిపత్రి పట్టణంలో 1880 సం లో జన్మించారన్నారు. ఆయన బాల్యం విద్యాభ్యాసం బళ్లారి పట్టణంలో జరిగిందని చిన్నతనం నుంచి కళలపై మక్కువ చూపించారన్నారు. న్యాయవాది గా ఆయన చేసిన ప్రజా సేవకు గాను బ్రిటీష్ ప్రభుత్వం రావు బహదూర్ అనే బిరుదుతో సత్కరించిందన్నారు. ఆయన 12 ఏట నుంచి నాటకాలలో నటించి బళ్లారిలో షేక్స్పియర్ క్లబ్ స్థాపించి ఆంగ్ల నాటకాలను ప్రదర్శించారన్నారు. ఆయన ఎక్కువగా సామాజిక నాటకాలను ప్రోత్సహించి సమాజంలో ఉన్న అసమానతలు,రుగ్మతలపై ప్రదర్శనలు నిర్వహించి నాటక రంగంలో విప్లవా త్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. మహిళలను కూడా ఆయన నాటక రంగం లో ప్రోత్సహించారన్నారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీస్, స్విట్జర్లాండ్, శ్రీలంక



వంటి దేశాలలో ఆయన నాటక ప్రదర్శనలు చేసి విదేశీయుల మన్ననలు పొం దారన్నారు. 1936లో సినిమా రంగంలోకి ప్రవేశించి సామాజిక మార్పులపై సినిమాలు నిర్మించారన్నారు. దళితుల కోసం ఆయన రాత్రిపూట పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. కుల వివక్షతను తీవ్రంగా వ్యతిరేకించి సామాజిక సమా నత్వానికి పాటుపడ్డారని సాంప్రదాయ విలువలను గౌరవిస్తూ ఒక మార్గదర్శ కులుగా జీవించారన్నారు. మరుగున పడిన కళలను కళాకారులను ప్రోత్సహిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాంతమ్మ, స్టెప్ సీఈవో సాయి గ్రేస్, ఎల్డిఎం జనార్దన,జిల్లా టూరిజం మేనేజర్ రామ్ కుమార్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠవాసునిగా ఎద్దుల కొండ్రాయుడు

– శ్రీవృషభాచలేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీవృషభాచలేశ్వర స్వామి దేవస్థాన వైకుంఠ వాసునిగా ఎద్దుల కొండ్రాయుడు భక్తులకు దర్శనమిచ్చాడు. శనివారం అర్చకుడు హరిప్రవీణ్ నేతృత్వంలో అభిషేకం, త్రికాల ఆరాధన, నివేదన తదితర విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలమాలలతో స్వామిని అలంకరణ చేసినట్లు ఆలయ ఇఓ హను మంత రావు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశామన్నారు. అంతే కాకుండా శ్రావణ మాసం 3వ శనివారం అంగరంగ వైభవంగా స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## తల్లిపాలు, శిశువు ఆరోగ్యానికి చాలా ముఖ్యం

– హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా

– ఈనెల 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** తల్లిపాలు, శిశువు ఆరోగ్యానికి చాలా ముఖ్యమని తాళ్లపల్లి పిహెచ్సి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిణి షఫిఉన్నిషా అన్నారు. శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నందిపల్లి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 1వ తేది నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు బిడ్డకు అమృతమని, పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాలు తాగే పిల్లల్లో శారీరక, మానసిక వికాసం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహారం అందిస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతాయని, ధీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుండి రక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రమాదేవి, ఏఎన్ఎం నాగస్వర్ణ, ఆశా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్



**మైదుకూరు మేజర్‌న్యూస్ :** 2025 – 26 విద్యాసంవత్సరానికి గాను మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు సివిల్ ఇంజనీర్ 31,, కంప్యూటర్ మరియు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ 26, కెమికల్ ఇంజనీర్ 17,ఎలక్ట్రికల్ మరి ఎలక్ట్రానిక్ ఇంజనీర్ 32, మెకానికల్ ఇంజనీర్ 29, మెటలర్జికల్ ఇంజనీర్ 33 కోర్సులకు సీట్స్ ఖాళీగాఉన్నాయని, ఈ కోర్సులలో మిగిలిన డిప్లమా సీట్ల కొరకు ఆగస్టు 5వ తేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్ కె. వి. సుబ్బారావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో స్వయంగా పాల్గొనవలేనని తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించవలెనని కోరారు. 1. ఎస్.సి/ఎస్టీ సర్టిఫికెట్, 2. టిసి, 3. కులధృవీకరణ పత్రం, 4, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం, 5. ఈడబ్ల్యూఎస్ /ఓసి విద్యార్థులకు నాలుగో తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, 6. ఏ.పి పాలిటెక్నిక్ 2025 హాల్ టికెట్ మరియు ర్యాంకు కార్డు, 7. ప్రాసెసింగ్ ఫీజు ఉంటుందన్నారు. పాలిసెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఓసి, బీసీ విద్యార్థులకు 700 రూపాయలు, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 250 రూపాయలు ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. అలాగే పాలిసెట్ పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోతే ఓసి/బీసీ విద్యార్థులకు 1100 రూపాయలు, ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులకు 350 రూపాయలు ఫీజు ఉంటుందన్నారు. పాలిటెక్నిక్ కాలేజ్ ట్యూషన్ ఫీజు 4700 రూపాయలుగా నిర్ణయించారు. సర్టిఫికెట్లు మరియు ఫీజు వెంటనే చెల్లించిన వారికి మాత్రమే సీట్లు కాయం చేయబడునని ఎటువంటి అధిక సమయం ఇవ్వబడదన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ప్రభుత్వం వారి ఇతర సదుపాయములు పొందుటకు అర్హులు కారన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పించబడును. విద్యార్థులు కడప రోడ్డులోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం దగ్గరలోని మసీదు ప్రక్కన గల మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నందు పాలిటెక్నిక్ నందు ఐదవ తేదీ ఉదయం గం 9:30 నిమిషాములనుండి నుండి సంప్రదించవలసినదిగా కోరారు.

# ముఖ్యమంత్రితో హజ్ కమిటీ మహబూబ్ బాషా మర్యాదపూర్వక కలయిక

## కడప హజ్ హౌస్ పెండింగ్ పనులను పూర్తి చేయించాలని సీఎంకు వినతి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** కడప జిల్లా జమ్మలమడుగు పర్యటన కు విచ్చేసిన "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుగు ప్రయాణం లో కడప ఎయిర్పోర్ట్ నందు కడప టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ బిటెక్.రవి తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్. మహబూబ్ భాషా కలవడం జరిగింది.ఈ సందర్భంగా సీఎం తో రాయలసీమ ముస్లిం మైనార్టీ లకు ఉపయోగ పడే కడప హజ్ హౌస్ పెండింగ్ పనులను పూర్తి చేయించాలని మహబూబ్ భాషా ముఖ్యమంత్రి ని అభ్యర్థించారు. అందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ కడప హజ్ హౌస్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.అనంతరం మహబూబ్ భాషా ముఖ్యమంత్రి తో మాట్లాడుతూ గడిచిన, గడుస్తున్న 2025 సంవత్సరం వరకు హజ్ యాత్ర కు వెళ్లే యాత్రికులు ఇతర రాష్ట్ర ల ఎయిర్పోర్ట్ నుండి వెళ్లే వారు.2026 నుండి హజ్ యాత్ర కు వెళ్ళుటకు మన ఆంధ్రప్రదేశ్ విజయవాడ ఎయిర్పోర్ట్ నుండి వెళ్ళుటకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కి,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, విమాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు కి, మైనార్టీ మినిష్టర్ ఫారుక్ కి, ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు షరీఫ్ కి, హజ్ కమిటీ ఛైర్మెన్ హస్సన్ భాషా కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే హజ్ యాత్ర కొరకు దరఖాస్తుల గడువు 7-8-2025 వరకు పొడగింపడం మరియు హజ్ యాత్ర ను విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి వెళ్లే వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందించడం పట్ల మైనార్టీ సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మహబూబ్ భాషా సీఎం తో చెప్పడం జరిగింది. అందుకు చంద్రబాబు మాట్లాడుతూ 2025 లో హజ్ యాత్రకు వెళ్లిన హాజీల పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని వారి సౌకర్యల ఏర్పాట్లను చూసుకొని హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసినటువంటి హజ్ కమిటీ ఛైర్మెన్, హజ్ కమిటీ మెంబర్లు మరియు హజ్ కమిటీ సభ్యుల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసారు.

## గండిక్షేత్రంలో ఘనంగా శ్రావణ మాస ఉత్సవాలు

– అంగరంగ వైభవంగా రెండో శనివారం

– తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు

– భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు



**చక్రాయపేట మేజర్‌న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి శ్రీ వీ రాంజనేయ స్వామి దేవస్థానం శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రావణ మాస రెండో శనివారం సంద ర్భంగా ఆలయ అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చ కులు స్వామిని ప్రత్యేక పూలతో అలం కరించి భక్తులకు దర్శ న భాగ్యం కల్పిం చారు. స్వామి వారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి ఛైర్మన్ కావలి క్రిష్ణతేజ వెల్లడించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో జరిగే స్వామి వారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అంతేకాకుండా స్వామి దర్శనానికి రాష్ట్ర నలు మూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. కాలినడకన వెళ్లే భక్తుల కోసం దారిపొడవునా అన్నదానం, జలప్రసాదాన్ని స్వామి భక్తులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతం

ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** ప్రపంచ తల్లిపాల దినోత్సవం పురస్కరించుకొని పులివెందుల 2 సెక్టార్ జెండా మా వీధిలో స్ట్రీట్ టు అంగన్ వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శు క్రవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల ఏడవ తేది వరకు అంగన్ వాడి కేంద్రాల్లో ఈ తల్లిపాల వారోత్సవాలను జరుపుతామన్నారు. అంగన్ వాడి కేంద్రంలో బిడ్డల తల్లులతో జరిగిన సమావేశంలో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వాటి ఆవశ్యకతను వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలను అందించాలన్నారు. తల్లిపాల ప్రాధాన్యతను తెలిపిందికే ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సావిత్రి, సోమేశ్వరి, మహిళ పోలీస్ నిరోషా, భాను, అంగన్వాడీ టీచర్స్ శివ రాజేశ్వరి, సలీమా, శాంతి, సుబ్బలక్ష్మి విజయలక్ష్మి, గర్భిణీలు ,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# దేశం గర్వించదగ్గ మహానటుడు బళ్ళారి రాఘవ

## ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి



**కడప టౌన్ , మేజర్‌న్యూస్ :** బెర్నార్డ్ షా, రాబర్ట్ సన్ లాంటి అంతర్జాతీయ నాటక కర్తలు, మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహోన్నత వ్యక్తులు, బందా కనక లింగేశ్వరావు, పులిపాటి వెంకటేశ్వర్లు మొదలైన ప్రసిద్ధ రంగస్థల కళాకారులు బళ్లారి రాఘవ నటనా వైభవాన్ని చూసి ప్రశంసల జల్లులు కురిపించారని, ఆయన భారతదేశం గర్వించదగ్గ మహానటుడని, తెలుగు నాటకాన్ని మహోన్నత శిఖరాలకు తీసుకెళ్లారని , దేశ విదేశాల్లో తన నటన వైభవాన్ని సాటి చెప్పి రాయలసీమకు వన్నెతెచ్చిన నటనా చక్రవర్తని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలియజేశారు.కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో శనివారం వైయస్సార్ జిల్లా రచయితల సంఘం వారు బళ్లారి రాఘవ 146 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గాంధీ గ బెంగళూరులో రాఘవ ప్రధాన పాత్ర పోషించిన 'దీనబంధు కబీర్' నాటకాన్ని చూసి 'రాఘవ మహారాజుకు జై 'అంటూ హర్షధ్వానాలు చేశారని, ఠాగూర్ రాఘవను 'రంగస్థలంపై విరాజిల్లుతున్న మహానటుడు రాఘవ' అన్నారని,నాటక రంగ చరిత్రలో 20వ శతాబ్దం పూర్వార్థం రాఘవ యుగంగా చెప్పవచ్చునని, ఆయన నటన,చేసిన రంగస్థల సంస్కరణలు, ప్రవేశపెట్టిన భావ విప్లవం తెలుగు నాటక రంగాన్ని దేదీప్యమానంగా వెలుగొంద చేశాయని, యూరప్ దేశమంతటా పర్యటించి తెలుగు నాటక రంగానికి నూతన సొబగులు చేకూర్చారని అన్నారు. ' మధురకవి' డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ రాఘవకు కోలాచలం వారి విజయనగర పతనం నాటకం లో పఠాన్ రుస్తుం పాత్ర విశేషమైన కీర్తి తెచ్చిపెట్టిందని, అలాగే హిరణ్యకశిపుడు, చాణిక్యుడు,దుర్యోధనుడు, కీచకుడు, హరిశ్చంద్రుడు, దశరథుడు, రావణుడు, ప్రతాపరుద్రుడు, కబీర్ దాసు,రామదాసు, మదనుడు మొదలైన పాత్రలు గొప్ప కీర్తి తెచ్చాయని, నాటకాల్లో స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలనే విప్లవాత్మకమైన మార్పు తెచ్చారన్నారు. కార్యక్రమములో రంగస్థల కళాకారులు దేవరశెట్టి గంగయ్య, యడవల్లి రామలింగయ్య,తిప్పలూరు ఓబులేసు, ప్రకాష్ శర్మ పాల్గొన్నారు.

# ఎర్రగుంట్ల దాతల సౌజన్యంతో

### శ్రావణమాసంలో శ్రీ కాశినాయన ఆశ్రమం నిత్యాన్నదానం
### ఎర్రగుంట్ల కు చెందిన అంగడి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిత్య అన్నదానం
### శ్రావణమాసంలో శ్రీ గండి క్షేత్రం నందు ఉన్న కాశినాయన ఆశ్రమంలో అన్నదానం
### దాతల సహకారం వల్లనే శ్రావణమాసంలో అన్ని శనివారాలలో మహా అన్నదానం

**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** ఎర్రగుంట్ల పట్టణంలో నివాసం ఉండే అంగడి లక్ష్మీదేవి అనే మహిళ తన దాతృతత్వంతో దాతల సహకారం తీసుకుంటూ ఆ దాతల సౌజన్యంతో శ్రీ కాశీనాయన ఆశ్రమం నందు అన్నదాన కార్యక్రమాలను నిత్యం చేస్తూ మానవత్వం చాటుకుంటుంది. శ్రావణమాసం లో అన్ని శనివారాలలో శ్రీ గండి క్షేత్రం నందు ఉన్న శ్రీ కాశినాయన ఆశ్రమం వద్ద ఎర్రగుంట్లకు చెందిన అంగడి లక్ష్మీదేవి సౌజన్యంతో దాతల సహకారం తీసుకుంటూ వారి సహాయ సహకారాలతో ఆశ్రమము నందు అన్ని శనివారాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందుకు దాతలు కూడా చాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని లక్ష్మీదేవి తెలుపుతుంది. ఇవేకాక పొలతల క్షేత్రంలో కూడా శ్రీ కాశినాయన ఆశ్రమం వద్ద తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది . అంతేకాక పొలతల క్షేత్రమందు మహా ఉత్సవంలో దాతల సహకారం తీసుకుంటూ అక్కడికి వచ్చిన భక్తులకు స్వీట్లు అనగా లక్ష లడ్లు చేయించి అక్కడ భక్తులకు పంపిణీ చేసే కార్యక్రమాలు కూడా చాలా చేసింది. ప్రతి ఏడాది తమ వంతు సహాయ సహకారాలు చేసుకుంటూ దాతలు సహకారం తీసుకుంటూ దాతలు అందించిన సౌజన్యముతోనే శ్రీ కాశీనాయన క్షేత్రం యందు అన్నదాన కార్యక్రమానికి ఆ మహిళ శ్రీకారం చుట్టుతుంది అందులో భాగంగానే ప్రతి ఏడాది శ్రీ గండి క్షేత్రం నందు శ్రావణమాసంలో అన్ని శనివారాల్లో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది . ఇందుకు ఎర్రగుంట్ల పట్టణంలో ప్రముఖ వ్యక్తులు దాతలు ముందుకు రావడం జరుగుతుందని ఆమె పేర్కొంటుంది. అంతేకాకుండా మహిళలు కొందరు పురుషులు కొందరు యువకులు కలిసి మానవత్వంతో ఆ శ్రీ కాశినాయన క్షేత్రం యందు సహాయ సేవా కార్యక్రమాలను చేసుకుంటూ మానవత్వం చాటుకుంటున్నారు. రెండో శనివారం కావడంతో శ్రీ కాశినాయన గండిచేత్రమందు ఉన్న శ్రీ కాశినాయన ఆశ్రమంలో శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వహిస్తుంది.



## దాతల సహకారంతోనే



ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ అడిగిన వెంటనే దాతలు సహకారం అందించడం వల్లనే పేదలకు అన్నదాన కార్య క్రమాన్న నిర్వహి స్తున్నామన్నారు శ్రీ కాశి నాయన క్షేత్రం నందు ఆశ్ర మం లో కూడా తమ వంతు సహాయ సహకారాలను సేవా దృక్పథాన్ని అందిస్తు న్నామన్నారు. శ్రావణమాసం అన్ని శనివారాలలో గండి క్షేత్రం నందు వెలిసిన శ్రీ కాశీనాయన ఆశ్రమం నందు దాతలు సహకారం తీసుకుంటూ మహా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

# నేడు పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం నేడు (ఆదివారం) జరుపబడునని ఎంపీడీవో రమణయ్య పేర్కొన్నారు.సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ రామ గోవిందరెడ్డి ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి మరియు శాసనసభ్యులు డాక్టర్ సుధలు హాజరుకానున్నారని ఎంపీడీవో తెలిపారు. కావున మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

# సరస్వతి విద్యా మందిరాలలో నైతిక విలువలు, దేశభక్తి భావాల కృషి అభినందనీయం

### మాతాజీలు, ఆచార్యుల శిక్షణ కార్యక్రమం - విద్యా మందిర అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తా
### - ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పాలపల్లి రోడ్డు సమీపాన ఉన్నటువంటి శ్రీ సరస్వతి విద్యా మందిరము ఉన్నత పాఠశాల యందు ఆగష్టు 2.3 వ తేదిలలో విభాగ్ లెవల్ (పూర్వ కడప, చిత్తూరు జిల్లాలు) ఆచార్య దక్షత వర్గాలు ఏర్పాటు చేయడం జరిగినది. మొదటి రోజు ప్రారంభకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి హాజరయ్యారు, మరియు ‘కమిటీ సభ్యులు. కడప జిల్లా మరియు చిత్తూరు జిల్లా సరస్వతి విద్యా మందిరము మాతాజీలు, ఆచార్యులు దాదాపుగా 100 మంది ఈ కార్యక్రమంలో శిక్షణ పొందదాటికి హాజరు కావడం ఒరిగినది. ఈ కార్యక్రమానికి విచ్చేసినటు వంటి ముఖ్య అతిథి అయిన రామ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యా మందిరాలు విద్యార్థులలో నైతిక విలువలు, దేశభక్తి భావాలను పెంపొందుటలో విద్యా మందిరాలుగా చేస్తున్న కృషిని కొనియాడారు. పాఠశాల అభివృద్ధి కరయు వారియొక్క సహాయ సహకారాలు అందజేస్తామని సభాపూర్వకంగా హామి ఇవ్వడం జరిగినది. ఈ విషయం గురించి విద్యాశాఖా మంత్రి అయిన లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేసి పాఠశాల అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.పాఠశాల సమితి కార్యదర్శి శంభురెడ్డి ఈ శిక్షణా




కార్యక్రమం యొక్క ప్రాముఖ్యాన్ని గురించి తెలియజేశారు. పాఠశాల సమితి అధ్యక్షులు ది. రాచుచంద్రరెడ్డి మరియు నైక్షణిక్ ప్రముఖ్ అయిన ల. సంజీవయ్య విద్యా మందిరాల స్థాపన ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ పాఠశాల యాజమాన్యం తరపున ధన్యవాదములు తెలియ చేశారు ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యా మందిరం మాతాజీలు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి పల్లె వాసి కిన్నెర సింగరయ్య సివిల్ కానిస్టేబుల్ గా ఎంపిక



**కలసపాడు మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన పోలీస్ ఫలితాలలో కలసపాడు మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన కిన్నెర సామెల్ మరియు చిన్నక్క గార్ల కుమారుడు కిన్నెర సింగరయ్య సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికయ్యాడు.తమ కుమారుడు కానిస్టేబుల్ గా ఎంపిక కావడం తో తల్లి దండ్రులు,బంధువులు,శ్రేయోభిలాషులు మరియు రెడ్డిపల్లె గ్రామస్తులు అందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు.తదుపరి వచ్చే పోలీస్ నోటిఫికేషన్ లో ఇంకా మంచిగా చదివి సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగాన్ని సాధించడం తన లక్ష్యం గా ఉందని అభ్యర్థి తెలియచేశాడు

# ఆహార విజ్ఞాన శాస్త్ర- సాంకేతిక కళాశాలలో రాఘవాచార్యులు జయంతి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల లోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో “తాడిపత్రి రాఘవాచార్యులు (బళ్ళారి రాఘవ) జయంతి” కార్యక్రమం శనివారం ఆగస్టు 2న జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు ‘తాడిపత్రి రాఘవాచార్యులు’ చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ తాడిపత్రి రాఘవాచార్యులు గొప్ప నటుడని, వృత్తి ప్రవృత్తుల్లో ఉన్నతంగా రాణించాడని తెలిపారు. తాడిపత్రి రాఘవాచార్యులు తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతికి వెచ్చించారని అన్నారు. కళ.. సమాజంలో మార్పు కోసం ఉపయోగపడాలనుకునేవారు. తెలుగు నాటక రంగం ఉన్నంతవరకు ఆయన పేరు అజరామరంగా ఉంటుందని పేర్కొన్నారు. తాడిపత్రి రాఘవాచార్యులు చేసిన సేవలకు ఆయన పేరుమీద ప్రభుత్వం వారు స్టాంపును కూడా విడుదల చేశారని తెలిపారు. ఈ సందర్భంగా తాడిపత్రి రాఘవాచార్యులు జీవిత చరిత్ర గురించి కళాశాల విద్యార్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, కళాశాల స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తి రెడ్డి, అధ్యాపకులు ఇంజినీర్ శ్రీకాంత్, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ ప్రదీప్ కుమార్, కుమారి మాధవి, ఎన్. వి. సుబ్బారెడ్డి, పి.డి డాక్టర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఐ.ఎస్. ఐ.మార్క్ కలిగిన టి మరియు కాఫీ పొడులను వాడాలి

### కూరగాయల మార్కెట్ అంగళ్ల తనకీ - మున్సిపల్ కమిషనర్ డి.రాముడు




**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మున్సిపల్ కమిషనర్ డి.రాముడు వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలతో కలిసి శనివారం కూడా ఉదయం పలు టీ మరియు కాఫీ షాపులను తనిఖీ చేశారు.నాణ్యమైన ఐ.ఎస్. ఐ.మార్క్ కలిగిన టి మరియు కాఫీ పొడులనే వాడాలని షాపు యజమానులకు సూచించారు.అంతేకాక టీ షాపుల యందు ప్రజారోగ్య హానికరమైన పేపర్ గ్లాస్ లను ఉపగించరాదు అన్నారు. అనంతరం వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు కూరగాయల మార్కెట్ నందలి అంగళ్ల యందు తనకీ చేసి ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, దుకాణాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్‌లో రోగుల సహాయకులకు అన్నదానం



కడప టౌన్ మేజర్‌న్యూస్ : శ్రీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నారాయణ సేవ ట్రస్ట్ అధ్యక్షులు వై. సాయి కిరణ్ రాజు మాట్లాడుతూ శనివారం రిమ్స్ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. మానవసేవయే మానవ సేవకు భావించి ఈ కార్యక్రమాన్ని చేపడు తున్నామన్నారు. తమ ట్రస్టు నిర్వహించే సేవ కార్యక్రమాలకు సహ కరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ నారాయణ సేవ ట్రస్ట్ సభ్యులు నరహరి,కార్తీక్,భార్గవ్, నారాయణ ,మధు, రామాం జనేయులు,శివ, రెడ్డెయ్య,ధరణి ,శ్రావణి, పిచ్చమ్మ పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ : మండలంలోని ముడుమాల, బొగ్గులవారిపల్లి అంగన్వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాలా వారోత్సవాలా ఘనంగా నిర్వహించినట్లు సూపర్వైజర్ ప్రత్యూష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు 1 గంటలోపు తల్లి పాలు పట్టాలి, మర్రుపాలు పట్టడం వలన బిడ్డకు వ్యాధినిరోధక శక్తీ పెరుగుతుంది. తల్లి బిడ్డ మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుంది, అలాగే తల్లికి వచ్చే గర్భ శాయ, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు రావు, 6 నెలలు వరకూ కేవలం తల్లి పాలు మాత్రమే తాపాలి పేర్కొన్నారు. ఈనెల తల్లిపాల వారోత్సవాలు ఈనెల 7వతేదీ వరకు అంగన్వాడి కేంద్రాలలో జరుగుతాయని పేర్కొ న్నారు. కార్యక్రమం తల్లులు గర్భివతులు ఆశలు,అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి శ్రావణమాస ప్రత్యేక పూజ అభిషేకం

### ప్రధాన అర్చకుడు పెంచలయ్య స్వామి



బద్వేల్ మేజర్‌న్యూస్ : బద్వేల్ నియోజ కవర్గంలోని వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనర సింహ స్వామికి శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భ ముగా ప్రత్యేకపూజా భిషే కాలను అంగరంగ వైభవంగా నిర్వహి ంచడం జరిగింది, స్వామివారి అభిషేకంలో భాగంగా ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పలు రకాల పుష్పలాతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమాన్ని చేశారు, ఆలయ పూజారి పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది, ప్రత్యేక అలం కరణలో ఉన్న శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారిని భక్తులు కన్నుల పండుగ దర్శించు కున్నారు,వచ్చిన భక్తులు మాట్లాడుతూ స్వామి,అమ్మ వారిని చూసినంత సేపు చూస్తూ ఉండాలి అనిపిస్తుంది అని ఆలయంలో ఉన్నంత సెపు మనసుకు ఎంతో మనశ్శాంతి ప్రశాంతత ఉంటుందని అలాగే మేము అనుకున్న పనులు మాకు సకాలం లో నేరావేరుతూ ఉన్నాయ్ అని ఈ ఆలయంలో కమర్షియల్ లేకుండా అందరిని ఒకే విధముగా చూస్తూ ఉంటారు అని తెలియజేశారు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యులు ఆలయం వద్ద అన్నదాన కైంకర్యం నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా కింద మంజూరైనా వితంతువు పెన్షన్ పంపిణి చేసిన మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని గోపవరం పంచాయితీ 3వ గ్రామ సచివాలయం నందు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా నూతనంగా మంజూరైనా వితంతువు పెన్షన్ల పంపిణి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ద్వారాకచర్ల రాఘవరెడ్డి, ఈశ్వరరెడ్డి, రాజేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసి ఓబుళరెడ్డి, వార్డు మెంబరు ఆది నారాయణారెడ్డి, కొండయ్య, లక్ష్మణ్, గౌస్, ఈశ్వరరెడ్డి, దొడియం సుబ్బారెడ్డి, కాలే సుబ్బరావు, సునీల్, వెంకటరాముడు, సుధాకర్ యాదవ్, కొల్లూశ్రీను, సిమెంట్ చంద్ర, రామాంజనేయులు, అల్తాప్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళకు రక్తదానం



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ : పట్టణంలోని లైటుపాలెం వీధికి చెందిన అమరావతి సావిత్రి అనే వృద్ధ మహిళకు రక్తకణాలు తగ్గడంతో పట్టణంలోని డాక్టర్ ఇంజా అమర్నాథ్ రెడ్డిని సంప్రదించగా ఆమెకు బి పాజిటివ్ రక్తం అవసరమని తెలపగా వారి బంధువులు ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బైసాని నారాయణ ను సంప్రదించగా ఆయన ప్రొద్దుటూరు పట్టణంలోని సాక్షి దినపత్రిక నందు విలేకరిగా విధులు నిర్వహిస్తున్న టంగుటూరు ఉదయ్ కుమార్ చే రక్తదానం చేయించారు. అలాగే ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ తమ్ముడు బైసాని చంద్ర నారాయణతో కూడా రక్తదానం చేయించారు.

## వై.వి.యూ. ఎం.బీ.ఏ. విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి ఇంటర్వ్యూలు

పెండ్లిమర్రి,, మేజర్‌న్యూస్ : యోగి వేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎంబీఏ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం ఈ నెల 5 వ, తేదీ ఉదయం 11.00 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వ హిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటెక్ (కం ప్యూటర్ సైన్స్ ఆ లైడ్ బ్రాంచెస్), ఎం.సీ.ఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) అర్హతలు కలిగి ఉండాలన్నారు. ఎంబీఏ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పేపర్ల ను అలానే అనుబంధ అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ప్రోగ్రామింగ్ ఇన్ ఆర్, మిషన్ లెర్నింగ్, ఐ ఓ టి, సైబర్ సెక్యూరిటీ, డేటా వేరు హౌసింగ్ అండ్ మైనింగ్, బిజినెస్ అనలిటిక్స్, టాబ్ల్యూ, పవర్ బి ఐ, డి.బి.ఎం.ఎస్, డేటా విజువలైజేషన్ లలో బోధిం చేవారు కావాలన్నారు. అర్హత ప్రమాణాలు ఉన్న ఆసక్తిగల అభ్యర్థులు బయో-డేటా అలానే సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల నకలు పత్రాలతో నేరుగా ప్రిన్సిపల్ కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. వివరాలకు వెబ్సైట్ ను సందర్శించాలని ప్రిన్సిపల్ సూచించారు.

# తల్లిపాలే బిడ్డకు తొలి ఆహారం




ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ : తల్లిపాలే బిడ్డకు తొలి ఆహారమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభ రాణి తెలి పారు. శనివారం సర్వో దయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటి ఆధ్వర్యంలో పట్టణంలోని అరవింద ఆశ్రమం వీధిలోని అంగన్వాడీ సెంటర్ నందు తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని ఐదో వార్డ్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి తెలియజేశారు. మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభ రాణి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు అభివృద్ధికి అవసరమైన అన్ని పోషకాలను అందిస్తుందని, తల్లిపాలలో ఆంటీ బాడీస్ ఉంటాయని, రోగనిరోధక శక్తిని అందిస్తాయని, వివిధ రకాల ఇన్ఫె క్షన్ల నుండి రక్షిస్తాయి తల్లిపాల వలన బిడ్డకు మేధాశక్తి జ్ఞాపకశక్తి వస్తుంది మరియు చెవి ఇన్ఫెక్షన్ల నుండి గ్యాస్ట్రో ఎంటరైటిస్ మరియు నిమోనియా వంటి వ్యాధులు తగ్గుముఖం పడతాయని వివరించారు. బిడ్డకు తల్లిపాలు గంటలోపు పాలు పట్టించాలని, ఇలా పట్టించడం వలన బిడ్డకు భవిష్య త్తులో ఊబకాయం, బి.పి, డయాబెటిస్, అతిసారము వంటి వ్యాధులు నియం త్రణలో ఉంటాయి తల్లికి ప్రసవానంతరము రక్తస్రావం తగ్గ తుంది గర్భా శయం యధాస్థితికి వస్తుందవి, తల్లికి బిడ్డకు అనుబంధం ఉంటుం దని, తల్లిపాలు ఉష్ణోగ్రతలో ఉంటాయని, తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సరు, గర్భాశయం ముఖ ద్వారము, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు రావు ప్రతి తల్లి బిడ్డకు పాలు ఇచ్చి ఆరోగ్యకరమైన ఆనందకరమైన జీవితంను బిడ్డకు అందించాలి 6 నెలల వరకు పాలు ఇవ్వాలి పాలు ఇస్తూ అదనపు ఆహారము రెండు సంవ త్సరం వరకు ఇవ్వడం వలన బిడ్డకు బిడ్డకు మధ్య ఎడమ వస్తుంది తల్లి కూడా బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని అవగాహన కల్పి ంచారు. ఎస్. ఐ.ఆర్.డి.ఎస్ సొసైటీ అధ్యక్షులు, ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లా డుతూ బిడ్డపుట్టిన గంటలోపుతల్లి పాలు (ముర్రు పాలు) తాపించి వారి బంగారు భవిష్యత్తు ను కాపాడాలన్నారు.కార్య క్రమంలో ఆరోగ్య కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వై.వీ.యూ డిప్లొమా కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఈనెల 11 వ, తేదీ వరకు గడువు పొడిగించి నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు డా.టి. లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీ.జీ.డి.పీ.ఆర్) , పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లోమా ఇన్ తెలుగు జర్నలిజం (పీ.జీ.డీ.టీ.జే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. కౌన్సిలింగ్'కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని సూచించారు. సాయంకాల తరగతులు కావడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతర వృత్తుల్లో ఉన్నవారు, పి.జి. స్థాయి కోర్సులు చదువుతున్న వారు కూడా ఇందులో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు యోగి వేమన విశ్వవిద్యాలయం వెబ్సైట్ సందర్శించాలని సూచించారు. ఆసక్తి కలవారు నేరుగా వై.వీ.యూ.లోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# లింగాలలో భాగవత సప్తాహంలో పాల్గొన్న తులసి రెడ్డి



లింగాల మేజర్‌న్యూస్ : లింగాల మండలంలోని లింగాల గ్రామంలో శనివారం శ్రీ సీతారామ స్వామి సన్నిధిలో భగవత్ గీత సప్తాహం ఆరవ రోజు సందర్భంగా ఈ ఉపన్యాసానికి విచ్చేసిన ఎపిసిసి మాజి అధ్యక్షులు మరియు మాజీ రాజ్యసభ సభ్యులు నర్రెడ్డి తులసిరెడ్డి, వారి మనవరాలు హన్సిక రెడ్డి,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రామాయణం,మహా భారతం,మహా భాగ వతం గ్రంథాలు భారతీయ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతి రూ పాలని, సమాజానికి నిత్య దిక్సూచికలని ఆయన కొనియాడారు.ఆధునిక మానవుడు అన్నీ ఉండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడు.ఈ పరిస్థితిలో భాగవత సప్తాహం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు.శ్రీమన్నారాయణుని అవతార లీలా గాథా వైభవమే శ్రీమద్ భాగవతం అన్నారు.ప్రహ్లాదుడు, ధృవుడు, అంబరీషుడు, ముచికుందుడు తదితర భక్తుల గాథల ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించే మోక్షాశాస్త్రమే భాగవతం అని ఆయన వివరించారు.ఇది ఒక అమృత భాండాగారం.భక్తితో విన్నా,చదివినా మోక్ష ప్రాప్తి కలుగుతుందన్నారు.మహా భాగవతాన్ని మొదట వ్యాస మహర్షి తన కొడుకు శుక మహర్షికి వినిపించాడు.శుక మహర్షి కలియుగ ఆరంభంలో గంగా నదీ తీరంలో భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించి పరీక్షిత్ మహారాజుకు వినిపించాడు.తద్వారా పరీక్షిత్ మహారాజు మోక్ష ప్రాప్తి పొందాడని తులసి రెడ్డి వివరించారు.భాగవతులు వ్యాసమహర్షి సంస్కృతం లో మహా భాగవతాన్ని వ్రాయగా భక్త కవి,సహజ కవి బమ్మెర పోతన తెలుగు లోకి ఆంధ్రీకరించారని,పోతన పద్యం రాని తెలుగు వాడు ఉండడని తులసి రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో భాగవతులు శ్రీయుతులు బాల కృష్ణా రెడ్డి,రామ కంచి రెడ్డి,ఓబుల్ రెడ్డి,నాగేశ్వర్ రెడ్డి,నరేంద్ర,సుధాకర్,నూర్ భాషా, చెన్నకేశవ రెడ్డి,కేశవ రెడ్డి,అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
KADAPA కడప జిల్లా
03 - 08- 2025 ఆదివారం

# శ్రీకృష్ణదేవరాయ నగర్ స్వయం సహాయక గ్రూపుసభ్యుల ప్రత్యేకసమావేశం

**రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ - మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి - గోపవరం ఎమ్మార్వో త్రిభువన్ రెడ్డి**

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోనిశ్రీకృష్ణదేవరాయ నగర్ స్వయం సహాయక గ్రూపు సభ్యులప్రత్యేక సమావేశాన్ని శనివారం రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి గోపవరం ఎమ్మార్వో త్రిభువన్ రెడ్డి అధ్యక్షా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయం సహాయ సంఘాల మహిళా సభ్యులు గ్రూపుగా ఏర్పడి తమ అవసరాలు నిమిత్తమై రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సక్రమ మార్గంలో సద్వినియోగం చేసుకోవడం తో దేశంలోని మహిళలు నిర్వహించే స్వయంసహాయ సంఘం అంటే ప్రత్యేక గుర్తింపు లభించింది అన్నారు. మహిళలకు ఎంత రుణము మంజూరు చేసిన నియమ నిబంధనలతో సర్ధరీ యోగపరచుకొని వారి కుటుంబ ఆదాయ వనరులు పెంపొందించేలా అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ గారు సమావేశం కు హాజరైన సభ్యుల యొక్క అవసరాల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న మహిళా సంఘాల సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేదరిక నిర్మూలన కొరకై పీ–4 ప్రోగ్రాం పథకాన్ని ఈ పథకం ముఖ్య




ఉద్దేశ్యం అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమన్నారు. పీ–4 ప్రోగ్రాం పేదరిక నిర్మూలన కొరకై సంపద అధికంగా ఉన్న ప్రజలు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు తమ వంతు సహాయ సహకారాలు అందించి వారి కుటుంబాలకు మద్దతుగా నిలబడటమే ఈ కార్యక్రమ ఉద్దేశమనితెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు రెవిన్యూ సిబ్బంది మున్సిపాలిటీ అధికారులు మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు .

# సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలే నన్ను గెలిపిస్తాయి

**పులివెందుల జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి**



పులివెందుల మేజర్‌న్యూస్ : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ,అభివృద్ధి కార్యక్రమాలే నన్ను గెలిపిస్తాయి పులివెందుల జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం ఏడాది పాలనలో అనేక సంక్షేమ పథ కాలు అభివృద్ధి కార్యక్రమాలు చెప్పట్టింది అని సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని సుపరిపాలన అందిస్తున్నామని పులివెందుల ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారు అని జడ్పీటీసీ ఎన్నికల్లో నన్ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు అని మారెడ్డి లతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తది తరులు పాల్గొన్నారు.

# రామనపల్లిలో స్వామిత్వా రీ సర్వే పై గ్రామసభ

**చెన్నూరు మేజర్‌న్యూస్ :** మండలంలోని రామనపల్లి గ్రామ పంచాయతిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా గ్రామ సచివాలయ ఉద్యోగులతో ప్రారంబించిన స్వామిత్వ కార్యక్రమమునకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపిడిఓ జి.సురేష్ బాబు, రామనపల్లి పంచాయతి కార్యదర్శి మేడా గురువేశ్వర రావు సచివాలయ సిబ్బందితో పాటు రామనపల్లి ప్రజలు ఈ కార్యక్రమమునకు హాజరయ్యారు.ఈ కార్యక్రమును ఉద్దేశించి డిప్యూటీ ఎంపిడిఓ సురేష్ బాబు మాట్లాడుతూ గ్రామ కంఠం క్రింద అనుభవ ఆధీనములో ఉన్న ఇళ్ళు,ఇంటి స్థలములకు చట్ట పరమైన యజమానులను నిర్ధారించటముతో పాటు వారికి యాజమాన్యపు ధ్రువపత్రముతో పాటు చట్ట భద్రత కలిపించే ముఖ్య ఉద్దేశముతో ప్రభుత్వము స్వామిత్వ కార్యక్రమమును మొదలు పెట్టినారన్నారు.ఈ కార్యక్రమమును ప్రజలు పూర్తి స్టాయిలో సద్వినియోగము చేసుకోవాలనియు,ప్రజలు స్వామిత్వ కార్యక్రమములో ఉద్యోగులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ప్రజలకు ఏమైనా ఈ స్వామిత్వ సర్వే నందు సమస్యలు ఉన్నట్లయితే అర్జీ రూపములో తెలియజేయాలని వంశపారంపర్యముగా సంక్రమించే ఆస్తులపైన ఏమైనా భాగపరిష్కార సమస్యలు ఉన్నట్లయితే సామరస్య పూర్వకముగా పరిష్కారము చేయుటకు మా అధికారులకు పూర్తి సహకారము అందించలని




పిలుపునిచ్చారు.ఈ గ్రామ సభకు హాజరై ఈ స్వామిత్వ కార్యక్రమములో పాల్గొని సర్వే నిర్వహించే ఉద్యోగులకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్న యెడల వారికి మా పూర్తి సహకారము అందించగలమని, స్వామిత్వ సర్వే చేయు సమయములో ఎటువంటి తప్పులు లేకుండా సర్వే చేయవలసినదిగా ఆదేశిస్తూ, ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సామరస్యంగా పరిష్కరించల ప్రజలతో తీసుకురావాలని సర్వేలో పాల్గొనే ఉద్యోగులకు తెలిపారు.

# రైతులకు అన్నదాత సుఖీభవ

**మండలానికి 4.19 కోట్లు – ఏవోశివరామ కృష్ణారెడ్డి**



**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద మండలంలోని 6111 మంది రైతులకు 4.19 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్. శివ రామ కృష్ణారెడ్డి తెలిపారు అన్నదా తలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న దాత సుఖీభవ పథకాన్ని ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరయపాలెంలో శనివారం లాంఛ నంగా ప్రారంభించారు అన్నారు. 2025–26 ఏడాదికి గాను మొదటి విడత అన్నదాత సుఖీభవ క్రింద ఒక్కో రైతుకురూ 5000 వేలు పీఎం కిసాన్ కింద రూ2000 వేలు మొత్తంరూ 7000 వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు రాజుపాళెం మండలానికి అన్నదాత సుఖీభవ నిధులు3.06 కోట్లు పిఎం కిసాన్ కింద1.13 కోట్లు మొత్తం 4.19 కోట్ల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుంది అన్నారు..

# ఓపెన్ డిగ్రీ, పీజి ఎగ్జామ్ లో మాస్ కాపీయింగ్

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** ప్రొద్దుటూరు మండలంలోని ఓ ప్రాంతంలో దాదాపు గత నెల రోజుల నుండి ఓపెన్ డిగ్రీ, పీజీ ఎగ్జామ్స్ ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఎగ్జామ్స్ లో మాస్ కాపీయింగ్ కు పాల్పడుతున్నారని ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిర్వాహకులు తమకు అందాల్సింది అందితే చాలు పరీక్ష జరిగితే చాలన్నట్లు వ్యవహరిస్తున్నారు. అసలు ఎగ్జామ్ పేపర్ అందడమే ఆలస్యం అన్నట్లు జవాబులు కూడా అందిస్తూ అందుకు విద్యార్థుల నుండి కొంత మొత్తం తీసుకుంటూ వారిని గట్టెక్కిస్తున్నారు. దీనిపై ప్రజల నుండి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. అసలు ఇళ్ల మధ్య లోనే సెంటర్ వున్నా ఇంత తతంగం చేయడం ఏమిటో అర్థం కావడం లేదని దుమ్మెత్తిపోస్తున్నారు.

## మాస్ కాపీయింగ్

దూర విద్యాకేంద్రం డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు సమాచారం. దీన్ని ప్రోత్సహించేలా సెంటర్ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూళ్ల పర్వానికి తెరలేపినట్టు తెలుస్తున్నది. పరీక్షలు పాస్ చేయిస్తామని ఒక్కో విద్యార్థి వద్ద మొత్తం కూడా వసూలు చేసినట్టు సమాచారం. వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. పలు చోట్ల విద్యార్థుల స్థానంలో మరొకరిని కూడా చేర్చి రాయిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

## భారీగా డబ్బు వసూళ్లు



ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ దందా నడిపించేందుకు విద్యార్థుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పేపర్ కు కొంత డబ్బు తీసుకుని వారికి కావాల్సిన గైడ్స్, బుక్స్ సమకూర్చడం, అవసరం అయితే సెల్ ఫోన్లు అందించి వారికి సహక రించడం చేస్తు న్నారని విశ్వ సనీయ వర్గాల సమా చారం. ఇలా విద్యా ర్థుల నుంచి వేలల్లోనే డబ్బు తీసుకుం టున్నట్లు తెలు స్తోంది. ఇక ఒకరికి బదులు వేరొ కరు పరీక్ష రాస్తే అవసరాన్ని బట్టి భారీగానే డబ్బులు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఓపెన్ పరీక్షలు కొంతమంది అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది.

# సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్



**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి శనివారం మధ్యాహ్నం నకాష్ 35/1 మరియు 35/2 సచివాలయాలను తనిఖీ చేయడం జరిగింది అందులో భాగంగా సచివాలయ సిబ్బంది అటెండెన్స్ పరిశీలించడం జరిగింది. సచివాలయంలో ఉన్న ప్రజలతో వారి సమస్యలు అడిగి తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు, అలాగే డివిజన్లోశానిటేషన్ పూర్తి స్థాయిలో జరగాలని అధికారుల ను ఆదేశించారు. అనంతరం గ్యాంగ్ వర్క్ పరిశీలించారు. మరియు 34/01 ఖలీల్ నగర్ సచివాలయంలో తనిఖీ చేశారు పి4 కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. చెత్త సేకరణ అక్రమ వసూలు పై జరుగుతున్న విచారణ కు స్వయంగా వెళ్లి తెలుసు కోవడం జరిగింది, సచివాలయాలలో పెండింగ్లో ఉన్న ఫైళ్లను త్వరగా పరిష్కరించి ప్రజలకు సమస్యలు లేకోకుండా చూడాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు.

# భక్తులతో సందడి నెలకున్న కదిరి ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయం

## ప్రత్యేక అలంకారంలో రత్నాచల అంజన్న



**పులివెందుల వేముల మేజర్‌న్యూస్ :** వేముల మండలం కణం కింద కొట్టాల గ్రామ సమీపంలోని కదిరి ఘాట్ నందు వెలసిన ఆంజనేయస్వామి ఆలయం రెండవ శనివారం రోజున భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ఈ శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారి భక్తులు, కణం కింద కొట్టాల పల్లె గ్రామస్తుల సహకారంతో రెండో శనివారం రోజు కూడా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మూడవ, నాలుగవ, ఐదవ శనివారాలలో కూడా వివిధ భజన కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల మండలంలోని పలు గ్రామాల నుంచి అనంతపురం జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు సేవ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు లబ్ధి చేకూర్చడమే కూటమి లక్ష్యం

## ప్రజా దర్బార్లో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** ప్రతి పేద కుటుంబానికి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా శనివారం తన నివాసం వద్దకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ కొన్నింటిని ఫోన్ ద్వారా మాట్లాడి మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు సిఫార్సు చేసి పరిష్కార మార్గాన్ని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలన పై ప్రతి కుటుంబం నుండి సంతృప్తి, సంతోషం వ్యక్తం అవుతుందని చెప్పారు. సంక్షేమ పాలనకు నిదర్శనం చంద్రబాబే అని, విభజన ఆంధ్ర ప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు 16 వేల కోట్ల లోటు లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపించారని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వైసిపి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి, ఆర్థికంగా పాతాళానికి తీసుకువెళ్లిందని తీవ్రస్థాయిలో వైసిపి పాలన తీరును తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి, టిడిపి నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి, రామచంద్ర, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ట్రావెల్ అలవెన్సులు ఇవ్వనున్న ప్రభుత్వం



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కిలో మీటర్ కంటే ఎక్కువ దూరంలో ఉన్న స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ట్రావెల్ అలవెన్సులు ఇవ్వనుంది. ఇందుకోసం కేంద్రం రూ.47.91 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 79,860 మంది విద్యార్థులు అర్హులుగా తేల్చారు. తల్లుల ఖాతాలో నెలకు రూ.600 చొప్పున 3 నెలలకోసారి రూ.1800 జమ అవుతాయి.

# బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అపార అవకాశాలు

## ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ




**పులివెందుల మేజర్‌న్యూస్ :** బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ తెలిపారు. బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ ప్రోగ్రాం లో చేరుటకు ఫార్మర్స్ కోటా మరియు నాన్ ఫార్మర్స్ కోటా లో బై.పి.సి విద్యార్థులు అప్లికేషన్స్ ఆగస్టు 6వ తేదీ వరకు, ఎం.పి.సీ విద్యార్థులకు ఫార్మర్స్ కోటా లో అప్లికేషన్స్ ఆగస్టు 7వ తేదీ వరకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా స్వీకరింపబడతాయని తెలిపారు. ఈ అప్లికేషన్స్ మరియు అడ్మిషన్ వివరాలు ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్ సైట్ మంచి పొందవచ్చని పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ తెలిపారు. పులివెందుల కళాశాలలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు అందుబాటులో ఉన్నదన్నారు. బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ ప్రోగ్రామ్ లో చేరుటకు దరఖాస్తు చేసుకునేటప్పుడు పులివెందుల కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలను ఎంచుకోవాలని కోరారు. ఈ కళాశాలలో అత్యాధునికమైన ప్రయోగశాలలు ఉన్నాయని, ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. గత సంవత్సరంలో కళాశాల నుండి ఉత్తీర్ణులైన ఎక్కువమంది ఈ కళాశాల విద్యార్థులు వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలలో మంచి వేతనంతో ఉద్యోగాలు పొందారని, కొందరు దేశ, విదేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ప్రోగ్రాంలో చేరారని పేర్కొన్నారు. ఈ ఫుడ్ టెక్నాలజీ కోర్సు అభ్యసించిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, భారత దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఈ కోర్సు అభ్యసించిన విద్యార్థిని విద్యార్థులకు మెండుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. మంచి జీతాలతో పాటు సుస్థిరమైన జీవితం లభిస్తుందని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లు, ప్రభుత్వం రంగంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, పేటెంట్ ఆఫీసర్లు మరియు ఇతర రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ విభాగాలలో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పరిశ్రమలు ప్రారంభించవచ్చని అన్నారు. విద్య పూర్తయ్యాక దేశ విదేశాల్లో ఎందరో తమ కళాశాల విద్యార్థులు అధ్యాపకులుగా మరియు వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో వివిధ శాఖలలో స్థిరపడుతున్నారని తెలియజేస్తూ, అడ్మిషన్ వివరాలు గురించి సుదీర్ఘంగా మాట్లాడారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ ని చూడాలని కోరారు. పులివెందులలో ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ ప్రోగ్రాంలో చేరుటకు ఆసక్తి ఉన్నవారు 9177776692 నంబర్ కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

# వికలాంగులకు, వయోవృద్ధులు స్క్రీనింగ్ శిబిరాలు. సద్వినియోగం చేసుకోండి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల నియోజకవర్గంలోని వివిధ మండలాలలోని దివ్యాంగులకు, 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు వివిధ రకాల సహాయ పరికరాలు అందించేందుకు అవసరమైన స్క్రీనింగ్ శిబిరం ఆగస్టు 4 సోమవారం ఏర్పాటు చేసినట్లు, అర్హులైన దివ్యాంగులు అందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా"ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాలో వికలాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలింకో ( భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ) వారి సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వ వికలా ంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండలాలవారీగా స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించి, అవసరమైన వికలాంగులకు ట్రైసైకిల్లు, వీల్ చైర్లు, బ్యాటరీ సైకిళ్లు, పోలియో క్యాలిపర్స్, జైపూర్ కాళ్లు, చేతులు, చంకకర్రలు, చేతిక ర్రలు, చెవిటిమిషన్లు, అంధుల చేతికర్రలు, చదువుకుంటున్న అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు, లెప్రసీ కిట్లు, వాకర్స్, రోలేటర్లు, అదే విధంగా 60 సంవత్సరాల వయసు దాటిన వయోవృద్ధులకు చేతికర్రలు వంటి అవసరమైన ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక వైద్యబృందంచే వికలాంగులకు, వృద్ధులకు స్క్రీనింగ్ నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. అనంతరం అర్హులైన వికలాంగులకు మరొకరోజు క్యాంపు నిర్వహించి సహాయ పరికరాలు పంపిణీ చేస్తారు. అలింకో మెడికల్ క్యాం పులు, పులివెందుల నియోజకవర్గంలో ఆగస్టు 4వ తేదీ సోమవారం రోజు మాత్రమే, ఆయా మండలాల వారీగా ఉదయం 9 గంటలకు వేంపల్లి, చక్రాయపేట మండలాల వారికి వేంపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్లో, సింహాద్రిపురం, లింగాల మండలాల వికలాంగులకు ఉదయం ఆయా జిల్లాపరిషత్ హైస్కూళ్లలో, అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు పులివెందుల మున్సిపాలిటీ, రూరల్, వేముల మండల వికలాంగులకు పులివెందుల పట్టణం, నాలుగురోడ్ల గాంధీ సర్కిల్ దగ్గరగల అహోబిలపురం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, తొండూరు, వీరపునాయునిపల్లె జిల్లాపరిషత్ హైస్కూళ్లలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేయబడినవని, ఆయా మండలాలలోని జిల్లా పరిషత్ హైస్కూళ్ల లో వారికి కేటాయించిన సమయంలో పరికరాలు అవసరమైన వికలాంగులు వారి సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డులు, యూ డి ఐ డి వైకల్య గుర్తింపుకార్డు, తదితర 2 సెట్ల జిరాక్స్ పత్రాలతో, 2 వైకల్య ఫోటోలతో, వయోవృద్ధులు 2ఫోటోలు, ఆధార్, రేషన్ కార్డులతో క్యాంపునకు హాజరు కావాలని, గతంలో 3 సంవత్సరాల లోపు సహాయ పరికరాలు పొందిన వారు మరలా దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులని, శారీరక వికలా ంగులలో 80% పైగా వైకల్యం కలిగి, నడవలేని వారికి మాత్రమే బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేస్తారని, నియోజకవర్గంలోని అర్హులైన వికలాంగులు, వయోవృద్ధులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకో వాలని, మరిన్ని వివరాలకు 9247339815 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.

# రిమ్స్ క్యాంటీయన్లు ఇస్తారాజ్యం

## ఆర్ సి పి, మదగలం ప్రసాద్



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** రిమ్స్ నందు ఉన్న క్యాంటీన్ యజ మానులు ఇష్ట రాజ్యంగా వ్యవహరి స్తున్నారని, అక్కడ ఉన్న మొత్తం వ్యాపార సము ఓదాయ గదులు కొందరి చేతుల్లోనే అధికంగా ఉన్నాయని, అక్కడ ఉన్న వారంతా సిండికేట్ ను పోలి వ్యాపారాలు చేస్తున్నారని, దీనివలన రోగుల జేబులకు చిల్లులు పడుతున్నాయని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మదగలం ప్రసాద్ తెలిపారు. శనివారం రిమ్స్ వ్యాపార సముదాయ గదులను ఆయన పరిశీలించి రోగులను ఆడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రిమ్స్ ఐపి ఎదురుగా ఉన్న వ్యాపార సముదాయాల గదులు ఎక్కువ శాతం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి చేతుల్లోనే ఐదు, ఆరు గదులలో అధిక ధరలలో వ్యాపారం నిర్వహిస్తున్నారని, పైగా కాంప్లెక్స్ లోని వ్యాపారులందరూ సిండికేట్ గా మారి ఒక్కొక్కరు ఒక్కో వ్యాపారాన్ని ఎంచుకున్నారని, రోగులు, వారి బంధువులు ఏవైనా వస్తువులు కొనాలంటే! అవి వారి వద్దనే, వారు చెప్పిన ధరలకే కొనాల్సిన దుస్థితి ఏర్పడిందని, సంబంధిత అధికారులు దీనిపై తగు చర్యలు తీసుకోవాలని, వ్యాపార సము దాయా గదులు ఒకరికి ఒక గది మాత్రమే ఉండు లాగున, అర్హులై ఉండి ఆసక్తి కలిగిన వారికి ఆయా గదులను అద్దెకు ఇవ్వాలని, ఏక ఆధిపత్య ధో రణి విడాలని అయన కోరారు. కార్యక్రమంలో విజయ్,లోకేష్ పాల్గొన్నారు

# ఏపీలోని పాఠశాలలో వారికి నో ఎంట్రీ

**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లోకి వ్యక్తులు రాజకీయ నేతలు ఎంట్రీ పార్టీల పోస్టర్లు బ్యానర్లు ప్రదర్శన పై ప్రభుత్వం నిషేధం విధించింది విద్యార్థులకు గిఫ్టులు స్కూలుకు డొనేషన్లు ఇవ్వాలన్న అనుమతి తీసుకోవాలని ఎస్ఎంసి మెంబర్స్ లను మినహాయించి విద్యార్థుల ఫోటోలు తీయొద్దని పేర్కొన్నారు విద్యార్థులు టీచర్లను బయటివారు కలవ డానికి వీల్లేదని ఫిర్యాదులు అడ్మినిస్ట్రేటివ్ భాగంలో చేయాలి జీవో ఇచ్చింది

# అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లుకొనుగోలు చేసిన యజమానులకు ఎస్ ఆర్ ఎస్ పై సమీక్ష సమావేశం

## మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు ఎస్ ఆర్ ఎస్ పథకంపై పై సమీక్ష సమావేశాన్ని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మున్సి పల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణ ప్రజలు అనధికారక లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్దిదా రులకుతెలియజేయడం ఏమనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎస్ఆర్ఎస్) పథకాన్ని జి.వో.ఎం.ఎస్.నెం. 134, తేది: 26.07.2025 ద్వారా అనధికారిక లేఅవుట్/ ప్లాట్ ను క్రమబద్ధీరకణ చేసుకునేందుకు ఆదేశాలు జారీ చేయడం జరిగినది అన్నారు. అనధికారికంగా ఏర్పాటు చేసినప్లాట్ /లేఔట్ యజమానుల తో లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎస్ఆర్ఎస్) పథకం నియమాల మేరకు తేది: జూన్ 30, 2025కి ముందు అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు/వ్యక్తిగత ప్లాట్ యజమానులు ఎవారైనా జులై 26 తేది నుంచి 90 రోజుల్లోపు ఎల్అర్ఎస్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ప్లాట్లును క్రమ బద్ధీకరణ కొరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ ప్రకారం 14 శాతంఓపెన్ స్పేస్ చార్జీలు నందు 50 శాతం రాయితీ తో అనగా 7 శాతం ప్రస్తుత మార్కెట్ విలువ మరియు లేఔట్ రెగ్యులరైజేషన్ చార్జీలు చెల్లించి క్రమ బద్ధీకరణ



చేసుకునేందుకు అవకాశం కలిపించిందన్నారు. అదేవిధంగా ప్లాట్ కొనుగోలుదారుడు లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎస్ఆర్ఎస్) పథకం నందు పూర్తి మొత్తం నగదును 45 దినముల లోపల చెల్లించిన యెడల 10 శాతం మరియు 90 రోజులలో చెల్లించిన యెడల 5 శాతం రెగ్యులరైజేషన్ చార్జీల నందు రాయితీ ఇవ్వడం జరుగుతుంద న్నారు.లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎస్ఆర్ఎస్) పథకానికి సంబంధించి ఎటువంటి సందేహాలున్న బద్వేలు పురపాలక సంఘం నందు టౌన్ ప్లానింగ్ విభాగం నందు సంప్రదించగలరుఅని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు ప్లాట్ల యజమానులు మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థలు చేసిన మెగా రక్త వారోత్సవాలు అభినందనీయం జిల్లా అధికారులు



**కడప టౌన్ ,మేజర్‌న్యూస్ :** కడప , అన్నమయ్య జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్త వారోత్సవాల రెండవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాల్లో ముందు ఎప్పుడు చూడని విధంగా నిర్వహించి, స్వచ్ఛంద సంస్థలు 457 యూనిట్లు రక్తాన్ని సేకరించడం కడప అన్నమయ్య జిల్లాలోని 20,000 మంది యువతీ యువకులకి రక్తదానంపై అవగాహన కల్పించినందుకు కడప జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, ఏపీ శాక్స్ కోఆర్డినేటర్ భాస్కర్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్స్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరయ్య నాయుడు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు రక్తదానం ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇంత గొప్ప మహోన్నతమైన కార్యక్రమం నిర్వహించడం కడప అన్నమయ్య జిల్లాలోని యువతీ యువకులకి రక్తదానంపై అవగాహన కలిపియడం ప్రశంసనీయమైనదని ఈ కార్యక్రమంలో పాల్గొని మెగా రక్త వారోత్సవాలు దిగ్విజయం చేసిన ప్రతి స్వచ్ఛంద సంస్థకు అభినందనలు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి మాట్లాడుతూ ఒక వారం రోజుల్లో 457 యూనిట్లు సేకరించడం ఎంతో గొప్ప విషయమని దీనికి తోడ్పడిన, రక్తదానం చేసిన యువతి యువకులకి అభినందనలు తెలిపారు. ఏపి శాక్స్ కోఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ఈ విధంగా ముందుకు వచ్చి వారం రోజులు పాటు మెగా రక్త వారోత్సవాల పేరుతో రక్తదాన శిబిరాలు నిర్వహించడం సమాజంలోని అందరికీ ప్రేరణగా నిలుస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఇండియన్ రెడ్ క్లాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ యశస్వి రెడ్డి, జిల్లా యంత్రాంగం, రక్తదాన శిబిరాలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలు పాల్గొని కార్యక్రమం దిగ్విజయం చేశారు.

# రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు

### బ్రహ్మం సాగర్ నుంచి 100 క్యూసెక్కుల నీరు విడుదల



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** రైతులు వరి నాటు ఉండటంవల్ల నీళ్లు అవసరమై కొంతమంది రైతులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రైతులు నీరుకు ఇబ్బందిగా ఉందని వెంటనే వారికి నీళ్లను ను విడుదల చేయాలని తెలుగంగ ఉన్నత స్థాయి అధికారులకు ఆదేశించారు. సందర్భంగా శనివారం తెలుగు గంగా ఏ ఈ నాగేశ్వరరావు బ్రహ్మంసాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు నీరును విడుదల చేశారు. ఈ నీళ్లు నందిపల్లి వరకు చెరువులకు రైతులకు ఉపయోగ పడుతుం దన్నారు. రైతులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు తెలుగంగ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

### కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి



**కడప క్రైమ్ మెజర్‌న్యూస్ :** కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి శనివారం ఉదయం నడకలో భాగంగా భగత్ సింగ్ పార్కులో మౌలిక వసతులు లైటింగ్ మరియు పచ్చదనాన్ని పెంచాలని అధికారులకు ఆదేశించారు. పార్క్ లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే క్లప్ వెహికల్స్ పార్కింగ్ ఏరియాను సందర్శించారు. క్లాప్ ఆటోల ఇన్ టైం రిజిస్టర్ లను పరిశీలించారు. క్లాప్ ఆటోల సూపర్వైజర్లకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం మున్సిపల్ గ్రౌండ్లో ఆడియన్స్ గ్యాలరీలను పరిశీలించి గ్యాలరీలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను త్వరగా పూర్తిచేయాలని వారిని ఆదేశించారు హాకీ మరియు స్కేటింగ్ కోర్టులో లైటింగ్ త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు,

# భక్తిశ్రద్ధలతో సప్త శనివార వ్రతా పూజ కార్యక్రమం

### ప్రత్యేక అలంకారంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి



**సింహాద్రిపురం మేజర్‌న్యూస్ :** పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సప్త శనివారాల వరద పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు హరి ప్రసాద్ శర్మ పవన్ కుమార్లు స్వామివారికి ఉదయాస్తమాన పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి తదితర కైకరియా పూజా కార్యక్రమాల అనంతరం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొని సప్త శనివారాల వ్రత పూజా కార్యక్రమాలు సాంప్రదాయంగా శోభాయ మానంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి కి శ్రావణ శనివార పూజలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** వెంకటేశ్వర స్వామి వారికి శనివారం శ్రావణ మాస రెండవ శనివారం సందర్భంగా పట్టణంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బొల్లవరం లో వున్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి, పాత మార్కెట్ లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వర స్వామి వార్ల మూలవిరాట్టులకు ప్రత్యేక గోక్షీర, పంచామృత అభిషేకాలు, పుష్పాలంకరణ, పూజలు నిర్వహిం చారు. అనంతరం పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించు కున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# లింగాల అంగన్వాడి కేంద్రంలో వారోత్సవాలు

### అంగన్ వాడి కేంద్రాల్లో వారోత్సవాలు

### ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకట లచ్చుమ్మ




**లింగాల మేజర్‌న్యూస్ :** లింగాల మండలంలో ని శనివారం దిగువ లింగాల అంగడి వాడి సెంటర్ నందు ఈ కార్యక్రమం నిర్వహిం చారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకట లచ్చుమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి అని వాటి ప్రాధాన్యతను తల్లులు తెలుసుకోవాలని అంగన్ వాడి కేంద్రాల సూపర్వైజర్ వెంకట లచ్చుమ్మ,అన్నారు,అంగన్ వాడికేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు, అలాగే తల్లులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించినట్లు సూపర్వైజర్ వెంకట లచ్చుమ్మ,తెలిపారు. మహిళా పోలీస్ ప్రవీణ,మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రాల్లో బిడ్డల తల్లులతో సమావేశం నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతను తెలియజేశారు, పుట్టిన బిడ్డకు తల్లిపాలు టీకాల పనిచేస్తాయన్నారు, ఈనెల 1వ తేదీ నుంచి ఏడవ తేది వరకు అన్ని అంగన్ వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. అలాగే బిడ్డల తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, లింగాల మహిళలు పాల్గొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలు నివారించాలి

### ఆర్ అండ్ బి ఈఈ కి పస్తం అంజి వినతి



**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** బేడ బుడగజంగం హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధానకార్యదర్శి పస్తం అంజి ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ ఈ ఈ ని కలిసి శనివారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది.కడప నగరం పులివెందుల బైపాస్ రోడ్డు రియాజ్ థియేటర్ ఎంపీపీ స్కూల్ నందు స్పీడుబ్రేకర్ వేయాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్ అండ్ బీ సర్కిల్ కడప వారికి కి విన్నవించారు.ఈ సందర్భంగా పస్తం అంజి మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి కడప పులివెందుల బైపాస్ రోడ్డు రియాజ్ థియేటర్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్ లేనందున అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి అన్ని ఉదయం నుంచి సాయంకాలం వరకు వేలాది మంది పబ్లిక్ వెహికల్స్ అక్కడ తిరగడం జరుగుతున్నదున అక్కడ స్పీడ్ బ్రేకర్ లేనందున ఎంపీపీ స్కూల్ పిల్లలైతేమి మరియు పెద్దవారైతేనేమే రోడ్డు అవతలికి ఇవతలికి నడవటం వలన ఈ మధ్యకాలంలో చాలా మందికి యాక్సిడెంట్లు జరిగినతున్నాయి కొంతమంది ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందని కనుక తమరు దయ తలచి మాకు తక్షణమే రియాజ్ థియేటర్ ఎంపీపీ స్కూల్ నందు స్పీడ్ బేకరు వేయించగలరని ప్రజల ప్రాణలు కాపాడలని ఆయన కోరారు. అందుకు ఈ ఈ సానుకూ లముగా స్పం దించి తక్షణమే స్పీడు బ్రేకర్ వేపిస్తానని అన్నారు. ఈ కార్యక్ర మములో.కే లక్షమయ్య. పి శ్రీను. పెద్దగగులు ఎం. వెంకటేష్ పాల్గొన్నారు.

# స్నేహం-రక్త సంబంధాలకన్నా గాఢమైన బంధం

## ఫ్రెండ్షిప్ డే సందర్భంగా

**లింగాల, మేజర్‌న్యూస్ : మన జీవితం ఓ ప్రయాణం. ఆ మార్గంలో మలుపులు, అడ్డంకులు ఎన్నో వస్తుంటాయి. కానీ కొంతమంది తోడుంటారు – భారం తడిపే చేతులు, మనోధైర్యాన్ని పెంపొందించే మాటలు, బాధను పంచుకునే హృదయాలు – వీరే నిజమైన మిత్రులు. స్నేహితుడు రక్తసంబంధంలో పుట్టకపోయినా, మన రక్తాన్ని మించిన స్థానం సంపాదించగలడు.**

**ఆదర్శ స్నేహ బంధాలు – చరిత్రకు చిరస్మరణీయ మచ్చుతునకలు**

**శ్రీకృష్ణుడు – అర్జునుడు**



ఈ బంధం మామూలు స్నేహం కాదు. ఇది ధర్మాన్ని నిలబెట్టే మైత్రి బంధం కృష్ణుడు అర్జునునికి తాను రథసారథిగా మారి, కురుక్షేత్ర యుద్ధంలో మార్గం చూపాడు. విషాదంలో కొట్టుమిట్టాడుతున్న అర్జునుడికి శ్రీమద్భగవద్గీతను ఉపదేశించడం ద్వారా స్నేహం అంటే కేవలం ఆనందపు వేళల పాటు కాదని, బాధల్లో మార్గదర్శకత్వంగా నిలవడమేనని ప్రపంచానికి చూపించాడు.

**కర్ణుడు – దుర్యోధనుడు**



కర్ణుని జీవితంలో అతని తల్లిదండ్రులు ఎవరో తెలియదు. అతనిని సమాజం అంగీకరించలేదు. కానీ ఒక్క దుర్యోధనుడే అతనిలో శూరతనాన్ని గుర్తించి స్నేహ హస్తాన్ని చాపాడు. కర్ణుడు కూడా తన జీవితాన్ని దుర్యోధనుడి స్నేహానికి అంకితం చేశాడు. చివరికి స్వధర్మం కాకున్నా స్నేహ ధర్మాన్ని రక్షిస్తూ తన ప్రాణాల్ని అర్పించాడు. ఈ బంధం ద్వారా ఒక నీతిని నేర్చుకోవచ్చు – నిజమైన మిత్రుడు నీకు శ్రేయస్కరమైనవాడు కాకపోవచ్చు, కానీ నీ బాధను నిన్ను మించినవిగా భావించేవాడు.

**రాముడు – సుగ్రీవుడు**



వనవాసంలో రాముడు సుగ్రీవుడితో కలుసుకుని అతనికి సహాయం చేశాడు. రాముడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని సుగ్రీవుడు తన వానర సేన ద్వారా రావణుడిని ఓడించేందుకు తోడయ్యాడు. ఇది ఆపదలో ఏర్పడిన బంధం ఎలా జీవితాంతం నిలవగలదో చూపించే ఉదాహరణ.

**సత్యభామ – రుక్మిణి**



రుక్మిణి రాజకుమారి, సత్యభామ ఒక గొప్ప వీర మహిళ. ఇద్దరూ శ్రీకృష్ణుని భార్యలైనా, వాళ్ళ మధ్య ఉన్న మహిళా మైత్రీ ఆ కాలంలోనే కాక, ఈ కాలానికీ ఆదర్శం. మనకు వినిపించేదేమైనా సినిమాలలో చూపించేది పోటీగా అనిపించినా, ఆ ఇద్దరూ ఒకరి ని మరొకరు అర్థం చేసుకునే స్నేహితులుగా ఎదిగారు.

**అలెగ్జాండర్ – హేఫెస్టియన్**



గ్రీకు చక్రవర్తి అలెగ్జాండర్‌కు తన చిన్ననాటి మిత్రుడు హేఫెస్టియన్ జీవితాంతం సహాయకుడు, మిత్రుడు. హేఫెస్టియన్ మరణించినప్పుడు అలెగ్జాండర్ బాధతో మూడు రోజులపాటు తినకపోవడం చరిత్రలో నమోదైంది. అతని శవానికి సామ్రాజ్యంలో గొప్ప స్మారక చిహ్నం కట్టించాడు.

**స్నేహం కోసం చేసిన ఈ విలువైన నివాళి – ప్రేమగల మిత్రుడికి చక్రవర్తి అయినా తలవంచేలా చేస్తుంది.**

**నెల్సన్ మండేలా – డెస్మండ్ ట్యూటు**



దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షపై పోరాటం చేసిన ఇద్దరు మేధావులు – మండేలా నాయకుడైతే, ట్యూటు అతని మిత్రుడిగా నైతిక బలం ఇచ్చాడు. వీరి స్నేహం సామాజిక న్యాయం సాధించడంలో తోడ్పడింది. ఇది స్నేహం సామాజిక మార్పులకు మార్గం వేసే శక్తిగా ఎలా మారుతుందో చూపిస్తుంది.

ఇవి కేవలం కొన్ని మచ్చుతునకలు మాత్రమే చరిత్రలో ఇలాంటి ప్రాణ స్నేహితులు కోకొల్లలు

**నేటి కాలానికి సందేశం**

ఈ ఆధునిక ప్రపంచంలో ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ వేల మంది ఉన్నా %-% మన బాధలను వినేవాళ్లు మాత్రం వేలలో ఒకరు. అసలు స్నేహితులంటే మనలోని లోపాలను చూసి కూడా ప్రేమించే వాళ్లు, మన విజయాలను చూసి ఈర్ష్య పడకుండా ఆనందించే వాళ్లు, మన మౌనాన్ని అర్థం చేసుకునే వాళ్లు.

**ఫ్రెండ్షిప్ డే ఈ సమాజానికి గుర్తు చేస్తోంది –**

స్నేహం అనేది షరతులు లేని ఒప్పందం, దూరాల్ని లెక్కచేయని బంధం, కాలాన్ని తలకిందులు చేసే శక్తి."

**ముగింపు మాట:**

ఈ రోజు మనం ఒక్కసారి మన జీవితంలోని మిత్రుల్ని గుర్తుచేసుకుందాం. ఎవరో మనతో నడిచిన కాలాన్నో, నవ్వించిన రోజుల్నో, కన్నీరు తుడిచిన క్షణాన్నో గుర్తుపెట్టి – ఒకసారి వారి పేరును మన హృదయంలో పలకుదాం– ఎందుకంటే, స్నేహితుడు నీ బలహీనతలను అంగీకరించే వ్యక్తి మాత్రమే కాదు – నిన్ను చూసి నువ్వు మర్చిపోయిన నీ గొప్పతనాన్ని గుర్తు చేసే వ్యక్తి.

**–లింగాల నేటి దినపత్రిక సూర్య రిపోర్టర్ టీ.సాయినాథ రెడ్డి.**

# ఆగస్టు 5న ఆందోళన కార్యక్రమం జయప్రదం చేయండి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్




**కమలాపురం, మేజర్‌న్యూస్ :** మీటర్ల బిగింపు వ్యతిరేకంగా ఆగస్టు 5న జరగనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి వేణుగోపాల్ తెలిపారు శనివారం కమలాపురంలో స్థానిక ఎండిఓ ఆఫీస్ ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచిన స్మార్ట్ మీటర్లు బిగించిన వాటిని పగలగొట్టి తీరుతామని. చంద్రబాబు నాయుడు సంస్కరణలు నేనే తెచ్చానని సంకలు అందుకోవడం కాదు ఆ సంస్కరణలు ప్రజల పైన పెనుభారంగా మారుతున్నాయనారు. గతంలో విద్యుత్ సంస్కరణలు చార్జీలు పెంచడంతో ప్రజా తిరుగుబాటు మొదలై ప్రభుత్వం కూలిపోయిందన్నారు. స్మార్ట్ మీటర్ బిగించడం తో ఎంతోమంది ప్రజలకు వెలుగులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు అధిక ధరలు చెల్లించలేక వ్యవసాయం మానుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్ అంటే మొబైల్ రీఛార్జ్ లాంటిది ముందు రీఛార్జ్ చేసుకుంటేనే సరఫరా ఉంటుంది లేకపోతే విద్యుత్ సరఫరా ఉండదు దీంతో మొత్తం చీకటి మాయం అవుతుంది సం స్కరణలో పేరుతో విద్యుత్ ఉత్పత్తి పంపిణీ సరఫరా సంస్థలను ప్రై వేటు వ్యక్తులకు దారా దత్తం చేసే ప్రయత్నం మా నుకోవాలన్నారు. విద్యుత్తు పేరుతో ప్రజలను దోపిడి చేసే ఆలోచన మానుకోవా లన్నారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి జి నాగేశ్వరావు. ఏఐటీయూసీ నాయకురాలు సుభాషిని మరియమ్మ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జరిగే సిఐటియు సమావేశంను జయప్రదం చేయండి




**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** ఆదివారం సాయంత్రం 6 గంటలకు యుటిఎఫ్ ఆఫీసులో జరిగే సిఐటియ ముఖ్యుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరావు హాజరవుతున్నట్లు సిఐటియు ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. ముఖ్యంగా ఆల్ ఇండియా మహాసభలు ఆంధ్రప్రదేశ్లో జరగడం మొదటిసారి అని తెలిపారు. ఈ మహాసభలు డిసెంబర్ 31 ,2026 జనవరి 4 వరకు ఐదు రోజులు పాటు విశాఖపట్నంలో జరుగుతున్నట్లు తెలిపారు. చివరి రోజు నాలుగో తారీఖున విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు దేశంలోనే ముఖ్యమైన నాయకత్వం హాజ రవుతున్నారన్నారు. ఈ తరుణంలో యుటిఎఫ్ ఆఫీసులో జరుగు సమావే శమును మధ్యతరగతి ఉద్యోగులు, సిఐటియు నాయకత్వం పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన లైన్‌మెన్‌కు ఘన సన్మానం



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్:** బి.మఠం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో అసిస్టెంట్ లైన్ మెన్ గా పనిచేయుచున్న రమేష్,బదిలీపై ఖాజీపేట విద్యుత్ సబ్ స్టేషన్ కు బదిలీపై వెళ్లడం జరిగింది ఈయన గతంలో రెండు సార్లు ఉత్తమ లైన్మెన్ గా అవార్డు పొందారు. ఆయనకు శనివారం స్థానిక విద్యుత్ అధికారులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఆయన స్థానంలో లైన్మెన్ దశరథరామిరెడ్డి ఇక్కడికి రావడం జరిగింది. ఆయన రాకతో ఆయనను కూడా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఇ రవిశంకర్,లైన్ మెన్ నాగేంద్ర, గ్రేడ్-2 జెఎల్ఎమ్ మలికె నాగ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్త మరణించడంతో వారి కుటుంబానికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన టిడిపి ప్రభుత్వం..



**కలసపాడు మేజర్‌న్యూస్:** మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామపంచాయతీలోని సింగరాయపల్లి గ్రామానికి చెందిన ఎంబడి శవరమ్మ మే నెలలో 17వ తేదీన కలసపాడు నుంచి సింగరాయపల్లె గ్రామానికి టీవీఎస్ ఎక్సెల్‌లో వస్తుండగా ఐటిఐ దగ్గర బొలెరో వాహనం ఢీకొనడంతో ఒక్కడికక్కడే మృతి చెందడం జరిగినది మృతురాలు సౌరమ్మకు టిడిపి సభ్యత్వం కార్డు కలిగి ఉన్నది టిడిపి సభ్యత్వం కార్డు ఉన్నది ఆమె భర్త వెంబడి భాస్కర్ కు పల్లె హరి ఓబులరెడ్డి మీకు ఇన్సూరెన్స్ సౌకర్యం వస్తాదని తెలుపగా బద్వేల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రితీష్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వారికి సంబంధించిన సభ్యత్వ ఆధారు బ్యాంక్ అకౌంట్ టిడిపి ఆఫీస్ అమరావతిలో ఎంటర్ చేయగా వారి భర్త ఏం బడి భాస్కర్ అకౌంట్‌కు ఎన్టీఆర్ ఇన్సూరెన్స్ 500000 చెక్కును జమ చేయడం జరిగింది మాజీ విజయమ్మ ఆదేశాల మేరకు ఆ చెక్కును సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పల్లె హరి ఓబుల రెడ్డి నందిగారి వెంకటసుబ్బారెడ్డి చేతుల మీదుగా ఎంబడి భాస్కర్ కు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎగువ తంబళ్లపల్లె టిడిపి నాయకులు యువ నాయకుడు పల్లె హరిఓబుల్ రెడ్డి, నందిగారి వెంకటసుబ్బారెడ్డి పల్లె ఉమామహేశ్వర్ రెడ్డి, ఆయకట్టు ప్రెసిడెంట్ వెంకటరెడ్డి కిరణ్ దిగువ పల్లె శ్రీనివాసులు తిమోతి రాజుపాలెం టిడిపి నాయకులు శ్రీనివాసులు, తెల్లవాడు టిడిపి నాయకులు రోసిరెడ్డి సత్యం పాల్గొన్నారు.